RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

PUBLISHED FROM : HYDERABAD | సంపుటి : 11 సంచిక : 82 బుధవారం 05 - 11 - 2025 ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ పేజీలు : 08 వెల : 2 రూ

## సీఎం రేవంత్ రెడ్డితో అమెజాన్

# వెబ్ సర్వీసెస్ బృందం భేటీ

- తెలంగాణలో ఏడబ్ల్యూఎస్ సెంటర్లు, విస్తరణపై చర్చ
- ముఖ్యమంత్రితో జర్మనీ కాన్సుల్ జనరల్ బృందం భేటీ
- హైదరాబాద్‌లో జీసీసీని ప్రారంభిస్తున్నట్లు సీఎంకు వివరించిన జర్మనీ బృందం
- హైదరాబాద్‌లో ఇన్నోవేషన్ హబ్‌గా తయారు చేసేందుకు సహకరించాలని కోరిన సీఎం
- ఐటీ, ఫార్మా, ఆటోమొబైల్ రంగంలో పెట్టుబడులు పెట్టాలని విజ్ఞప్తి
- పెట్టుబడుల విషయంలో ప్రభుత్వ సహకారం ఉంటుందని హామీ



తెలంగాణ రాష్ట్రంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రాజెక్టులను విస్తరించాలని, ఆ కంపెనీ ప్రతినిధులను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ బృందం మంగళవారం సచివాలయంలో రేవంత్ రెడ్డితో భేటీ అయింది. రాష్ట్రంలో కొనసాగుతున్న ఏడబ్ల్యూఎస్ ప్రాజెక్టు పనులు, విస్తరణ ప్రణాళికలపై సీఎంతో వారు చర్చించారు. రాష్ట్రంలో ఏడబ్ల్యూఎస్ కంపెనీ మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ మద్దతు, సహకారం ఉంటుందని ముఖ్యమంత్రి అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఏడబ్ల్యూఎస్ డేటా సెంటర్ గ్లోబల్ హెడ్ కెర్రీ పర్సన్, ఇన్ఫ్రా పబ్లిక్ పాలసీ డైరెక్టర్ విక్రమ్ శ్రీధరన్, అనురాగ్ కిల్నాని, తదితరులు పాల్గొన్నారు.

**హైదరాబాద్‌లో డ్యుయిష్ బోర్స్ కంపెనీ జీసీసీ :** మరోవైపు జర్మనీ కాన్సుల్ జనరల్ మైకేల్ హాస్పర్ - మిగతా 2 లో

## చేవెళ్ల బస్సు ప్రమాదంను సుమోటోగా తీసుకున్న

# రాష్ట్ర మానవ హక్కుల కమిషన్

- డిసెంబర్ 15వ తేదీ లోపు నివేదిక సమర్పించాలని ఆదేశం
- రవాణా శాఖ, హోంశాఖ, భూగర్భ గనుల శాఖల ముఖ్య కార్యదర్శులకు నోటీసులు
- నివేదిక పంపాలని కలెక్టర్, ఆర్టీసీ ఎండీలకు కూడా ఆదేశం


2 లో

## నవంబర్ 6 నుంచి ఎమ్మెల్యేల

# అనర్హత పిటిషన్లను విచారణ

- పిటిషన్లను విచారించనున్న స్పీకర్
- నవంబర్ 6, 7, 12 మరియు 13 తేదీల్లో విచారణ
- ఇరువైపుల వాదనలు విననున్న స్పీకర్
- ప్రతి రోజు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విచారణ



బీఆర్ఎస్ దాఖలు చేసిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై విచారణకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ షెడ్యూల్ ఖరారు చేశారు. ఈ నెల 6వ తేదీ నుంచి రెండో - మిగతా 2 లో

## విశాఖలో భూ ప్రకంపనలు



2 లో

- ఉలిక్కిపడిన నగరవాసులు
- గాజువాక, మధురవాడ సహా పలు ప్రాంతాల్లో ప్రకంపనలు
- కొన్ని సెకన్ల పాటు కంపించిన భూమి
- తెల్లవారుజామున 4:16 నుంచి 4:20 గంటల మధ్య ఈ భూ ప్రకంపనలు సంభవించాయి
- నిద్రలో ఉలిక్కిపడి బయటకు పరుగులు తీసిన ప్రజలు

## నక్సల్స్‌కు మరో

# గట్టి ఎదురుదెబ్బ

- ఆయుధ కర్మాగారాన్ని ధ్వంసం చేసిన డీఆర్‌జీ బలగాలు
- ఛత్తీస్‌గఢ్ సుక్మా అడవుల్లో మావోయిస్టుల స్థావరం గుర్తింపు
- రహస్య ఆయుధ ఫ్యాక్టరీపై డీఆర్‌జీ బలగాల మెరుపుదాడి
- భారీగా తుపాకులు, పేలుడు పదార్థాలు, యంత్రాలు స్వాధీనం
- లొంగిపోయిన నక్సలైట్ల సమాచారంతోనే ఈ దాడి
- ఈ ఏడాదే 249 మంది మావోయిస్టుల హతం - ఎస్పీ కిరణ్ చవాన్
- మృతుల్లో మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు కూడా




ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టులకు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సుక్మా జిల్లాలోని దట్టమైన అడవుల్లో రహస్యంగా నడుపుతున్న ఆయుధాల తయారీ కర్మాగారాన్ని డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ) బలగాలు గుర్తించి ధ్వంసం చేశాయి. ఈ మెరుపుదాడిలో భారీ ఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలు, యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. కోయిమెంట-ఎరపల్లి ప్రాంతంలో మావోయిస్టుల కదలికలపై అందిన పక్కా సమాచారంతో ఈ ఆపరేషన్ నిర్వహించారు. కొన్ని నెలలుగా మావోయిస్టులు ఈ ఫ్యాక్టరీని అత్యంత రహస్యంగా నిర్వహిస్తున్నారు. సోలార్ ప్యానెళ్ల సహాయంతో నడిచే ఈ వర్క్‌షాప్‌లో ఆయుధాలను తయారు చేస్తున్నట్లు - మిగతా 2 లో

# ఛత్తీస్‌గఢ్‌లో రైలు ప్రమాదం

- ప్యాసింజర్, గూడ్స్ ఢీ
- ఆరుగురు మృతి!
- ఘోర రైలు ప్రమాదం
- బిలాస్‌పూర్‌లో ఎదురెదురుగా ఢీకొన్న ప్యాసింజర్, గూడ్స్ రైలు



ఛత్తీస్‌గఢ్‌లో రైలు ప్రమాదం జరిగింది. బిలాస్‌పూర్‌లో ప్యాసింజర్, గూడ్స్ రైలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. రైల్వే అధికారులు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయచర్యల్లో నిమగ్నమయ్యారు.

అయితే, ప్రమాదానికి గల కారణం ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. విషయం తెలుసుకున్న రైల్వే సిబ్బంది రెస్క్యూ, వైద్య బృందాన్ని సంఘటనా స్థలానికి పంపారు. స్థానిక యంత్రాంగం కూడా సహాయం అందించడానికి - మిగతా 2 లో

## లండన్‌లో చంద్రబాబుతో భారత హైకమిషనర్ భేటీ



- లండన్ పర్యటనలో ఉన్న చంద్రబాబు
- ఏపీ సీఎంను కలిసిన దురైస్వామి
- ఏపీ, యూకే యూనివర్శిటీల మధ్య భాగస్వామ్యంపై చర్చ

లండన్ పర్యటనలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో యూకేలో భారత హైకమిషనర్ విక్రమ్ దొరైస్వామి సమావేశమయ్యారు. ఈ భేటీలో ఏపీ, యూకేల మధ్య విద్యా సంబంధాలను బలోపేతం చేయడంపై వీరు ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలోని విద్యార్థులకు ప్రపంచస్థాయి అవకాశాలు కల్పించే దిశగా ఈ సమావేశం జరిగినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా ఏపీతో యూకేలోని పలు ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలు కలిసి పనిచేసే - మిగతా 2 లో

# 70వ ప్రజా దర్బార్...

- 4 వేల మందిని కలిసిన మంత్రి నారా లోకేశ్
- మంత్రి నారా లోకేష్ 70వ రోజు ప్రజాదర్బార్ నిర్వహణ
- నాలుగు గంటల్లో సుమారు 4 వేల మందిని కలిసిన మంత్రి నారా లోకేశ్
- రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చి సమస్యలు తెలిపిన ప్రజలు
- వైసీపీ పాలనలో అన్యాయం జరిగిందంటూ పలువురి ఆవేదన
- ఉద్యోగ, కార్మిక సంఘాల నుంచి పలు విజ్ఞప్తులు
- అందరికీ అండగా ఉంటానని హామీ



రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమం 70వ రోజుకు చేరుకుంది. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం మంగళవారం మరోసారి జనసంద్రంగా మారింది. మంత్రిని కలిసి తమ సమస్యలను విన్నవించుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా ప్రజలు, కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు తరలివచ్చారు. సుమారు నాలుగు గంటల పాటు సాగిన ఈ కార్యక్రమంలో మంత్రి లోకేశ్ దాదాపు 4 వేల మందికి పైగా ప్రజలను స్వయంగా కలిసి వారి సమస్యలను ఓపికగా విన్నారు. ప్రతి ఒక్కరినీ పేరుపేరునా ఆప్యాయంగా పలకరిస్తూ వారి నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. సమస్య తీవ్రతను బట్టి అక్కడికక్కడే అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి ఒక్కరి సమస్యను - మిగతా 2 లో

## ఏపీ పల్లెల్లో రోడ్ల నిర్మాణానికి

# కేంద్రం భారీ నిధులు




- డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ వెల్లడి
- ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రహదారులకు కేంద్రం భారీ చేయూత
- ప్రత్యేక సాయం కింద రూ.2000 కోట్లు మంజూరు
- పనుల నాణ్యతపై రాజీపడొద్దని అధికారులకు పవన్ కల్యాణ్ ఆదేశం

ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ రహదారుల రూపురేఖలను మార్చే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో అడుగు వేసింది. రాష్ట్రంలోని పల్లెల్లో దెబ్బతిన్న పంచాయతీరాజ్ రోడ్ల పునర్నిర్మాణం కోసం 'స్పెషల్ అసిస్టెన్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్' (సాస్కి) పథకం కింద రూ. 2,000 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో గ్రామాల్లో రహదారుల వ్యవస్థను మెరుగుపరచనున్నట్లు డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ - మిగతా 2 లో

# సంపాదకీయం

## చేతులు మారుతున్న రాజ్యాంగ ఆయుధం



నక్సల్స్ ఉద్యమంలో ఉన్నత స్థానంలో ఉన్న నాయకులు మల్లోజుల వేణుగోపాల్ రావు, తక్కళ్లపల్లి వాసుదేవరావులు చాలామంది సహచరులతో కలిసి ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమక్షంలో ఇటీవల లొంగిపోయారు. ఈ సందర్భంగా తమ ఆయుధాలను రాజ్యం చేతుల్లో పెట్టారు. దానికి బదులుగా మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రులు వారి చేతికి భారత రాజ్యాంగ ప్రతిని అందజేశారు. ఈ సందర్భంగా - ఆ నాయకులు ఆయుధాలతో పాటు తమ అభిప్రాయాలనూ ఆశయాలనూ మార్చుకున్నారా? లేక తాత్కాలిక యుద్ధ విరమణ చేశారా? ఆయుధం స్థానాన్ని రాజ్యాంగం పూరించగలుగుతుందా? లేక రహస్య పోరాటాలు తిరిగి కొనసాగుతాయా?- తదితర ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ చర్చ కన్నా ముందు ప్రపంచవ్యాప్తంగా 21వ శతాబ్ది పూర్వార్ధంలో సమాజంలో పునాది స్థాయిలో జరిగిన మార్పు చేర్పులను రాజకీయ, సామాజిక, ఆర్థిక, పౌర, సాంకేతిక, శాస్త్ర రంగాల వెలుగులో పరిశీలిస్తే కొంతమేరకైనా మేలు జరుగుతుంది. ప్రపంచీకరణ వేగంగా పరుగెడుతున్న చోట దీర్ఘకాలిక ప్రాతిపదికన ప్రజా పోరాటాలు కొనసాగించడం అంత సులభమైన విషయం కాదు. సమాజం పునాదిలో జరుగుతున్న మార్పుల వలన ఉపరితలంలో అగుపించే ఉద్యోగాలలో, వ్యక్తులలో, వ్యవస్థలో స్థిరత్వం ఉండడానికి వీలు లేని ఒక సంక్షోభ వాతావరణం ఏర్పడింది. సమాజం క్రమంగా భూస్వామ్య వ్యవస్థ నుంచి పెట్టుబడిదారీ విధానంగా పరివర్తన చెందింది. జాతీయ పెట్టుబడిదారుడు అంతర్జాతీయ క్యాపిటలిస్టుగా ఎదిగాడు. బహుళ జాతి సంస్థలు మార్కెట్లను ఆక్రమించాయి. పంటలు పండించే సాధారణ స్వభావం మార్చుకొని రియల్ ఎస్టేట్‌గా భూమి రూపాంతరం చెందింది. కనబడే ప్రభుత్వాలను తెర వెనుక ఉండి నడిపే డ్రైవింగ్ ఫోర్స్ ఒత్తిడి శాసనకర్తల నిర్ణయాలపై ప్రభావం చూపుతున్నది. ఆయా ప్రభుత్వాలను చెప్పుకోదగ్గ స్థాయిలో కట్టడి చేస్తోంది. లాభాల దాహం తీరని జాతీయ అంతర్జాతీయ పెట్టుబడిదారులు అందరూ ఒక్కటిగా తమ తమ ఉత్పత్తులను ఆయా దేశాలకు ఎగుమతి చేస్తారు. ఎగుమతి దిగుమతులపై ఆయా దేశాల మీద ఒత్తిడి తెచ్చి సుంకాల రాయితీని పొందుతారు. దీనితో ఎగుమతి దిగుమతుల సుంకాల మధ్య అంతరం ఏర్పడుతుంది. తద్వారా ఎక్కువ దేశాలు నష్టపోతే, కొన్ని సంపన్న దేశాలు లాభపడతాయి. ఇదే నేటి ప్రపంచీకరణ తెచ్చిన వాణిజ్యయుద్ధ నీతి తంత్రం. జాతీయంగా అంతర్జాతీయంగా ఏర్పడిన ఇటువంటి పరిస్థితులలో రహస్య సాయుధవాదులు తమ ఆయుధాలతో పోరాట బాట వీడిన సదరు వ్యక్తులకు రాజ్యాంగ ప్రతులను ప్రభుత్వ నాయకులు అందజేస్తున్నారు. ఇక్కడే తిరకాసు అంతా ఉంది. ఆయుధాలతో సహా లొంగిపోవడం అంటే తమ ఆశయం పట్ల విశ్వాసం సడలిపోయినట్టు భావించాల్సి వస్తుంది. రాజ్యాంగ ప్రతిని స్వీకరించడం అంటే రాజ్యం పట్ల విధేయత కలిగి ఉండడంగా అన్వయించుకోవాలి. రాజ్యాంగాన్ని రాజ్యం త్రికరణ శుద్ధిగా ఆచరించి, ప్రజా సమస్యలను పరిష్కరిస్తే సమాజంలో పోరాటాల అవసరమే ఉండదు. కానీ రాజ్యం తీసుకున్న నిర్ణయాలపైన జాతీయ అంతర్జాతీయ పెట్టుబడిదారుల ప్రభావం ఉంటుందని ముందే మాట్లాడుకొని ఉన్నాం. ఇటువంటి పరిస్థితుల్లో రాజ్యాంగాన్ని అమలు చేయడం శాసనకర్తలకు అసాధ్యంగా పరిణమిస్తుంది. వీటన్నిటి పర్యవసానంగా సంపద అంతా పిడికెడుమంది చేతుల్లో కేంద్రీకృతం అవుతున్నది. ధనవంతులకు పేదలకు మధ్య పూడ్చలేని అగాథం పెరిగిపోతున్నది. శాసనసభలు బలహీనపడుతున్నాయి. నాయకులు ఏం చేయాలో దిక్కుతోచక 'అభివృద్ధి, సంక్షేమం' అనే మాటలను చర్విత చర్వణంగా వల్లె వేస్తుంటారు. ప్రజల నిత్యావసర జీవితం తీవ్రమైన ఆటుపోట్లకు గురి అవుతుంది. సహజ ప్రకృతి వనరులు తీవ్రంగా నష్టపోతాయి. విలువలు సంస్కృతి దిన దినం లుప్తమైపోతాయి. రైతులు, కుటీర పరిశ్రమలు తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతాయి. చివరికి ఆయా వృత్తులను ఆశ్రయించి జీవిస్తున్నవారు అటు ఉత్పత్తులకు గిట్టుబాటు ధర రాక, ఇటు ఉత్పత్తి ఉపకరణాల వ్యయం పెరిగిపోవడం వలన తలకు మించిన అప్పుల పాలై ఆత్మహత్యలను ఆశ్రయిస్తారు. ఈ నేపథ్యంలో నేడు ఆయుధాన్ని వీడి రాజ్యాంగాన్ని చేతబూనుతున్నవారు భవిష్యత్తులో చట్టబద్ధంగా ప్రజాసమస్యల పరిష్కార ఉద్యమాలను చేపట్టినా%-% వాటికి ఫలితం ఉంటుందా? అన్నదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న!

## ఏపీ పల్లెల్లో రోడ్ల నిర్మాణానికి కేంద్రం భారీ నిధులు

**మొదటిపేజీ తరువాయి** - శాఖ మంత్రి పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రహదారుల నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పనులు చేపట్టే కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులు నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా పనిచేయాలని ఆదేశించారు. నిర్మాణం ప్రారంభమైనప్పటి నుంచి పలు దశల్లో నాణ్యతను తనిఖీ చేయడం తప్పనిసరి అని తెలిపారు. ప్రమాణాలకు విరుద్ధంగా పనులు చేపట్టినా, ఏవైనా అవకతవకలు జరిగినట్టు తేలినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అలాగే, పుట్టపర్తిలో జరగనున్న శ్రీ సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని అక్కడి పంచాయతీరాజ్ రహదారుల అభివృద్ధికి ప్రత్యేకంగా రూ.35 కోట్లు కేటాయించినట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ సహకారం, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గదర్శకత్వంతో ప్రతి గ్రామానికీ పటిష్టమైన, దీర్ఘకాలం మన్నే రహదారులను అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

## లండన్‌లో చంద్రబాబుతో భారత హైకమిషనర్ భేటీ

**మొదటిపేజీ తరువాయి** - విషయంపై ఇరువురు నేతలు చర్చించుకున్నారు. ముఖ్యంగా నాలుగు కీలక అంశాల్లో భాగస్వామ్యం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనపై వీరి మధ్య సంభాషణ జరిగింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో జాయింట్ వెంచర్లు ఏర్పాటు చేయడం ద్వారా విద్యా రంగంలో కొత్త అవకాశాలు సృష్టించడంపై దృష్టి సారించారు. అలాగే, ఏపీ, యూకే వర్సిటీల మధ్య విద్యార్థుల మార్పిడి (స్టూడెంట్ ఎక్స్ఛేంజ్) కార్యక్రమాలను ప్రోత్సహించడం ద్వారా ఇరు ప్రాంతాల విద్యార్థులు విజ్ఞానాన్ని, సాంస్కృతిక అంశాలను పరస్పరం పంచుకునేలా చూడాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమాల ద్వారా ఏపీ విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య, పరిశోధన అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ భేటీ ఏపీ, యూకే మధ్య విద్యా సంబంధాల్లో ఒక కీలక ముందడుగుగా భావిస్తున్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో రైలు ప్రమాదం

**మొదటిపేజీ తరువాయి** - అక్కడికి చేరుకుంది. అయితే ఈ ప్రమాదంతో ఆ మార్గంలో వెళ్లే రైళ్లలో పూర్తిగా అంతరాయం ఏర్పడింది. అధికారులు ఇప్పటికే పలు రైళ్లను రద్దు చేశారు. మరికొన్నింటిని దారి మళ్లించారు. బిలాస్‌పూర్-కట్ని విభాగంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంపై రైల్వే యంత్రాంగం దర్యాప్తు ప్రారంభించింది.



# 70వ ప్రజా దర్బార్...



**మొదటిపేజీ తరువాయి** - పరిష్కరించే బాధ్యత తమదని, అందరికీ అండగా నిలుస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ప్రజాదర్బార్‌కు వచ్చిన వారిలో అధికశాతం మంది గత వైసీపీ ప్రభుత్వంలో తాము ఎదుర్కొన్న కష్టాలను, అన్యాయాలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. గత ప్రభుత్వంలో తమపై అక్రమ కేసులు బనాయించారని, ఆస్తులు లాక్కున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ నేతల ప్రోద్బలంతో తన భూమిని బలవంతంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని శ్రీకాకుళం జిల్లాకు చెందిన టీడీపీ కార్యకర్త దనపాన హరికృష్ణ మంత్రి లోకేశ్ కు ఫిర్యాదు చేశారు. గుంటూరు జిల్లా కాకుమానుకు చెందిన మెరిగల రవిబాబు, తన వారసత్వ భూమిని వైసీపీ కార్యకర్త కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని, పోలీసులు స్పందించడం లేదని వాపోయారు. టీడీపీ సానుభూతిపరుడిననే కారణంతో అతిథి అధ్యాపకుడి ఉద్యోగం నుంచి తొలగించారని కర్నూలు జిల్లాకు చెందిన ఉలిద్ర రవి మంత్రికి తన గోడును వెళ్లబోసుకున్నారు. ఈ ఫిర్యాదులపై విచారణ జరిపి తగిన న్యాయం చేస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు.

**ఉద్యోగ, కార్మిక సంఘాల వినతులు**

రాష్ట్రవ్యాప్తంగా పలు ఉద్యోగ, కార్మిక సంఘాల ప్రతినిధులు కూడా మంత్రిని కలిసి తమ సమస్యలను విన్నవించారు. వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న హెల్త్ అసిస్టెంట్ (మేల్) పోస్టులను భర్తీ చేయాలని అన్ ఎంప్లాయిస్ పారా మెడికల్ హెల్త్ అసిస్టెంట్ అసోసియేషన్ కోరింది. ఏపీ జెన్ కో, ట్రాన్స్ కో, డిస్కమ్స్‌లో పనిచేస్తున్న 23,500 మంది కాంట్రాక్టు కార్మికుల సేవలను క్రమబద్ధీకరించి, వేతన సవరణ చేయాలని ఆంధ్ర రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

**స్థానిక సమస్యలపైనా వెల్లువెత్తిన విజ్ఞప్తులు**

నల్లమల అటవీ ప్రాంతంలోని చెంచు గూడెంలలో కొత్త పాఠశాలలు మంజూరు చేయాలని గిరిజన సంఘం ప్రతినిధులు కోరారు. చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని స్థానికులు విన్నవించారు. విజయవాడ గ్రామీణ ప్రాంతంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని గరిమెళ్ల అనిల్ కుమార్ ఫిర్యాదు చేశారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తనకు సీఎం సహాయ నిధి ద్వారా వైద్యసాయం అందించాలని చిత్తూరుకు చెందిన ప్రకాశ్ బాబు కోరారు. వచ్చిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు.

## విశాఖలో భూ ప్రకంపనలు



**మొదటిపేజీ తరువాయి** - విశాఖపట్నం నగరంలో మంగళవారం తెల్లవారుజామున స్వల్ప భూకంపం సంభవించింది. నగర ప్రజలు గాఢ నిద్రలో ఉండగా, భూమి కొన్ని సెకన్లపాటు కంపించడంతో భయాందోళనలకు గురయ్యారు. ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. వివరాల్లోకి వెళితే, తెల్లవారుజామున 4:16 నుంచి 4:20 గంటల మధ్య ఈ భూ ప్రకంపనలు సంభవించాయి. గాజువాక, మధురవాడ, రిషికొండ, భీమిలి, కైలాసపురం, మహారాణిపేట, విశాలాక్షినగర్, అక్కయ్యపాలెం తదితర ప్రాంతాల్లో భూమి కంపించినట్లు స్థానికులు పేర్కొన్నారు. అకస్మాత్తుగా సంభవించిన ఈ పరిణామంతో నిద్ర నుంచి ఉలిక్కిపడిన నగరవాసులు ఏం జరుగుతోందో తెలియక ఆందోళన చెందారు. భయంతో కుటుంబ సభ్యులతో కలిసి ఇళ్ల నుంచి బయటకు వచ్చి రోడ్లపై గుమికూడారు. కొంతసేపటి వరకు ఇళ్లలోకి వెళ్లడానికి కూడా జంకారు. అయితే, ఈ భూకంపం తీవ్రత రిక్టర్ స్కేలుపై ఎంత నమోదైందనే వివరాలు ఇంకా అధికారికంగా వెలువడలేదు. ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరిగినట్లు సమాచారం లేదు.

## సీఎం రేవంత్ రెడ్డితో అమెజాన్ వెబ్ సర్వీసెస్ బృందం భేటీ



**మొదటిపేజీ తరువాయి** - బృందం కూడా సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అయ్యింది. హైదరాబాద్‌లో జీసీసీని ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రికి వివరించింది. డ్యుయిష్ బోర్స్ కంపెనీ విస్తరణలో భాగంగా రాజధాని నగరం హైదరాబాద్‌లో జీసీసీని ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాద్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని రేవంత్ రెడ్డి మైకేల్ బృందాన్ని కోరారు. జీసీసీ ఏర్పాటుతో రెండేళ్లలో సుమారు వెయ్యి మందికి ఉపాధి లభిస్తుందని జర్మనీ బృందం వెల్లడించింది. హైదరాబాద్‌ను ఇన్నోవేషన్ హబ్‌గా తయారు చేసేందుకు సహకరించాలని సీఎం వారిని కోరారు. జర్మనీ టీచర్లను ఇక్కడ నియమించి విద్యార్థులకు జర్మనీ భాషను నేర్పించాలని విజ్ఞప్తి చేశారు. పెట్టుబడుల విషయంలో తెలంగాణ ఎల్లప్పుడూ జర్మనీ భాగస్వామ్యాన్ని కోరుకుంటోందని సీఎం తెలిపారు.

## చేవెళ్ల బస్సు ప్రమాదరను సుమోటోగా తీసుకున్న రాష్ట్ర మానవ హక్కుల కమిషన్



**మొదటిపేజీ తరువాయి** - రంగారెడ్డి జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై రాష్ట్ర మానవ హక్కుల సంఘం స్పందించింది. చేవెళ్ల మండలం మీర్జాగూడ గేటు వద్ద కంకర లోడుతో వస్తున్న టిప్పర్... బస్సును ఢీకొనడంతో 19 మంది దుర్మరణం చెందగా, పలువురు గాయపడ్డారు. ఈ ఘటనను సుమోటోగా స్వీకరించిన రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, డిసెంబర్ 15వ తేదీలోపు సమగ్ర నివేదికను అందజేయాలని ఆదేశించింది. ఈ మేరకు రవాణా శాఖ, హెూంశాఖ, భూగర్భ గనుల శాఖల ముఖ్య కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. జాతీయ రహదారుల ప్రాంతీయ అధికారి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఆర్టీసీ ఎండీలను సైతం నివేదిక పంపాలని ఆదేశించింది. ప్రమాద సమయంలో ట్రక్కులోని కంకర బస్సులోని ప్రయాణికులపై పడటంతో ఊపిరాడక వారు మృతి చెందారు.

## నవంబర్ 6 నుంచి ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను విచారణ



**మొదటిపేజీ తరువాయి** - దశ విచారణను నిర్వహించనున్నారు. రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్ కింద నవంబర్ 6, 7, 12 మరియు 13 తేదీల్లో విచారణ చేపట్టనున్నారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ కోరుతోంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్ కుమార్ (జగిత్యాల), పోచారం శ్రీనివాస్ రెడ్డి (బాన్సువాడ), తెల్లం వెంకట్రావు (భద్రాచలం), అరెకపూడి గాంధీ (శేరిలింగంపల్లి)లను అనర్హులుగా ప్రకటించాలన్న పిటిషన్లపై విచారణ జరగనుంది. స్పీకర్ ఇరువైపుల వాదనలు వింటారు. తొలుత పిటిషనర్లు, ఆ తర్వాత ప్రతివాదులను క్రాస్ ఎగ్జామినేషన్ చేయనున్నారు. రోజుకు ఇద్దరు చొప్పున విచారణ జరగనుంది. ప్రతి రోజు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కెమెరాల సమక్షంలో విచారణ కొనసాగుతుంది. మొదటి దఫా విచారణ సెప్టెంబర్ 29, అక్టోబర్ 1, అక్టోబర్ 24 తేదీల్లో జరిగింది. ప్రకాశ గౌడ్, కాలే యాదయ్య, గూడెం మహిపాల్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డిలను విచారించారు. తెలంగాణ అసెంబ్లీ చరిత్రలో అనర్హత పిటిషన్లను విచారించడం ఇదే మొదటిసారి.

# నక్సల్స్‌కు మరో గట్టి ఎదురుదెబ్బ




**మొదటిపేజీ తరువాయి** - బలగాలు గుర్తించాయి. దాడి సమయంలో సగం తయారైన 17 నాటు తుపాకులు, బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్లు, పెద్ద మొత్తంలో ఉక్కు రాడ్లు, ట్రిగ్గర్ మెకానిజమ్స్, లేత్ మెషీన్లు, వెల్డింగ్ కిట్లు, డ్రిల్లింగ్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు మందుపాతరల తయారీకి సిద్ధంగా ఉంచిన జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్లు, సర్క్యూట్ బోర్డులను కూడా సీజ్ చేశారు. ఈ ఆపరేషన్ వివరాలను సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ మీడియాకు వెల్లడించారు. కొద్ది వారాల క్రితం లొంగిపోయిన మావోయిస్టులు ఇచ్చిన కచ్చితమైన సమాచారంతోనే ఈ స్థావరాన్ని గుర్తించగలిగామని తెలిపారు. ఆ స్థావరంలో ఆర్మీ రైఫిళ్లతో సరితూగే ఆయుధాలను తయారు చేసేందుకు సంబం ధించిన బ్లూప్రింట్లను కూడా కనుగొన్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది జరిగిన ఎన్‌కౌంటర్లలో ఇప్పటివరకు 249 మంది నక్సలైట్లను మట్టుబెట్టినట్లు ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు. మృతుల్లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు వంటి అగ్రనేతలు కూడా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. "వరుస ఎదురుదెబ్బలతో బలహీనపడిన మావోయి స్టులు, ఈ ఫ్యాక్టరీ ద్వారా మళ్లీ పుంజు కోవాలని చూశారు. కానీ మేం వారి ప్రయత్నాన్ని సమాధి చేశాం" అని ఆయన స్పష్టం చేశారు. ఆపరేషన్ అనంతరం స్థావరంలోని పేలుడు పదార్థాలను సురక్షితంగా నిర్వీర్యం చేసి, మొత్తం ఫ్యాక్టరీని దగ్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న భద్రతా సిబ్బంది సురక్షితంగా తమ శిబిరానికి చేరుకున్నారు.

## జూబ్లీహిల్స్‌లో బీజేపీకి ఎన్ని ఓట్లు వస్తాయో జోస్యం చెప్పిన పొన్నం ప్రభాకర్

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీఆర్ఎస్ కుమ్మక్కయ్యారన్న పొన్నం

### బీజేపీని బీఆర్ఎస్-2గా మార్చేశారని తీవ్ర విమర్శలు

### జూబ్లీహిల్స్‌లో బీజేపీకి 10 వేల ఓట్లు కూడా రావని సవాల్



కేంద్ర మంత్రి, బీజేపీ నేత కిషన్ రెడ్డి బీఆర్ఎస్‌తో నేరుగా కుమ్మక్కయ్యారని, బీజేపీ వ్యవస్థను 'బీఆర్ఎస్-2'గా మార్చేసి వారికి హ్యాండోవర్ చేశారని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సంచలన ఆరోపణలు చేశారు. కిషన్ రెడ్డి ప్రచార సరళి "దింపుడు గళ్లం ఆశ"లా ఉందని ఆయన తీవ్రంగా విమర్శించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థికి 10 వేల ఓట్ల కంటే ఎక్కువ రావని తాను సవాల్ విసురుతున్నట్లు పొన్నం స్పష్టం చేశారు. "గత ఎన్నికల్లో మీరు బీఆర్ఎస్ మద్దతు తీసుకున్నారు. ఇప్పుడు దానికి గురుభక్తిగా ఈ ఉప ఎన్నికలో బీఆర్ఎస్‌కు లోపాయికారీగా మద్దతు తెలుపుతున్నారని జూబ్లీహిల్స్‌లో బహిరంగంగా చర్చ జరుగుతోంది" అని పొన్నం అన్నారు. కేంద్ర మంత్రిగా, సికింద్రాబాద్ ఎంపీగా పదేళ్లుగా ప్రాతినిధ్యం వహిస్తున్న కిషన్ రెడ్డి, తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఏం చేశారో చెప్పగలరా? అని పొన్నం ప్రభాకర్ సూటిగా ప్రశ్నించారు. "ఇప్పటికైనా కిషన్ రెడ్డి నిజాయతీగా వ్యవహరించాలి. సొంత పార్టీ అభ్యర్థిని మోసం చేయకుండా, బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ చెబుతున్నట్టుగా నిబద్ధతతో పనిచేయాలని డిమాండ్ చేస్తున్నాను" అని పొన్నం ప్రభాకర్ హితవు పలికారు. ఈ ఆరోపణలతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల రాజకీయాలు మరింత వేడెక్కాయి.

# కాంగ్రెస్ పార్టీకి ఓటేసి కంటోన్మెంట్ ప్రజలు మోసపోయారు..

జూబ్లీహిల్స్ ప్రజలు మోసపోకండి.

: జూబ్లీహిల్స్ ప్రజలారా మోసపోతే గోసపడతారు.




**తెలంగాణ సేన న్యూస్ :** జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల వేళ రాజకీయ వేడి పెరుగుతోంది. ఈ క్రమంలో కంటోన్మెంట్ ప్రాంతంలో వెలసిన కొన్ని బ్యానర్లు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. “కాంగ్రెస్ పార్టీకి ఓటేసి మోసపోయాం...జూబ్లీహిల్స్ ప్రజలు మోసపోకండి” అంటూ ఉన్న ఈ బ్యానర్లు స్థానికుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. కంటోన్మెంట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, అభివృద్ధి పనులు ఆగిపోయాయని ప్రజలలో అసంతృప్తి నెలకొంది. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ ప్రజలకు హెచ్చరికలా, జాగ్రత్త పిలుపుగా ఈ బ్యానర్లు ఏర్పాటు చేశారనే మాట వినిపిస్తోంది..జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో రాజకీయ వాతావరణం రోజురోజుకూ వేడెక్కుతుండగా, ఈ బ్యానర్లు మరింత చర్చకు దారితీశాయి. జూబ్లీహిల్స్ ప్రజలారా ఈ బ్యానర్లను చూసి. మీరు మోసపోవద్దు. మోసపోతే గోసపడతారు. అందుకే సరియైన నిర్ణయం తీసుకోండి. ఎవరైతే మంచి అభివృద్ధి చేస్తారో వారికి మీ అమూల్యమైన ఓటు వేయండి.

# ముధోల్ ఎంపీడీవోకు ఘన సన్మానం



**ముధోల్:04అక్టోబర్(తెలంగాణ సేన న్యూస్) :** ముధోల్:మండల కేంద్రమైన ముధోల్ మండల పరిషత్ కార్యాలయంలో ఇటీవలే నూతన ఎంపీడీవో గా లవకుమార్ బాధ్యతలను చేపట్టారు మంగళ వారం ముధోల్ మండల గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షులు చాతరాజు దుర్గ ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి పథకాలను లబ్ధిదారులకు అందేందుకు కృషి చేస్తానని ఎంపీడీవో తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఎంపీఓ శివకుమార్ ముత్యం రెడ్డి ఉన్నారు.

# వేములవాడ రాజన్న ఆలయంలో సామూహిక కార్తీక దీపోత్సవం ప్రారంభం





**వేములవాడ, నవంబర్ 4 (తెలంగాణ సేన) :** వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు తేది: 22-10-2025 (బుధవారం) నుండి తేది: 20-11-2025 (గురువారం) వరకు సామూహిక కార్తీక దీపోత్సవం కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం 14వ రోజు భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జ్యోతి ప్రజ్వలన చేసి సాంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా ప్రారంభించారు. ఆలయ ఈవో శ్రీమతి రమాదేవి భీమేశ్వర స్వామి ఆలయ దేవాలయంలో సేవా సమితి సభ్యులు భక్తి గీతాలు, భజనలతో భక్తులను అలరించారు. కార్తీక మాస పర్వదినాలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ సామూహిక కార్తీక దీపోత్సవ కార్యక్రమం ప్రతి రోజూ సాయంత్రం 6:00 గంటల నుండి రాత్రి 8:00 గంటల వరకు సుహాసినీల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించబడుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సుహాసినీలకు ఆలయ అర్చకులు మరియు ఆలయ ఉద్యోగులు చేతుల మీదుగా వాయనం పసుపు కుంకుమ అక్షింతలు గాజులు స్వామివారి ఫోటోను అందజేయడం జరిగినది. వారి వెంట ఈ ఈ రాజేష్, ఏఈఓ బ్రహ్మన్న గారి శ్రీనివాస్, ఏ ఈ రామకృష్ణ, పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ ,సీనియర్ అసిస్టెంట్ ఎడ్ల శివ సాయి చింతపంంటి కమలాకర్, ఆలయ అర్చకులు వేద పండితులు ఉద్యోగులు ఉన్నారు.

# చేవెళ్ల మిర్జాగూడ బస్సు ప్రమాదం దురదృష్టకరం

బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు దుబ్బ సుకుమార్



**తెలంగాణ సేన న్యూస్ మిడ్జిల్ :** చేవెళ్ల మిర్జాగూడ బస్సు ప్రమాదం దురదృష్టకరం అన్నారు మృతుల కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే ఆదుకొని క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని బి.ఆర్.ఎస్ మిడ్జిల్ మండల సీనియర్ నాయకులు దుబ్బ సుకుమార్ కోరారు 21 మంది ప్రయాణికులు మృతి చెందడం అత్యంత బాధాకరం వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని కోరుకుంటున్నాను బస్సు ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయిన ఘటన కలిసివేసింది మళ్లీ ఇటువంటి ఘటన పునావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని బి ఆర్ ఎస్ సీనియర్ ఉమ్మడి జడ్చర్ల దుబ్బా సుకుమార్ కోరారు

# పిఎసిఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన మార్కెట్ యార్డ్ చైర్మన్ జ్యోతి అల్వాల్ రెడ్డి



**తెలంగాణ సేన న్యూస్ మిడ్జిల్ :** మిడ్జిల్ మండల కేంద్రంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన మార్కెట్ యార్డ్ చైర్మన్ జ్యోతి అల్వాల్ రెడ్డి మరియు పిఎసిఎస్ అధ్యక్షులు కూచూరు శ్రీనివాసరెడ్డి ఉపాధ్యక్షులు అల్వాల్ రెడ్డి మాజీ ఎంపీటీసీ గౌస్ వార్డు సభ్యులు పర్వతాలు ఉస్మాన్ మరియు మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు నరేందర్ రెడ్డి. బాల్ రెడ్డి. సత్యం. ఆదం. జహంగీర్. హరి. సాయిలు. బాలస్వామి. శివ. రమేష్. తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నేడు గౌడ కులస్తుల సర్వసభ్య సమావేశం



**ముధోల్:04నవంబర్(తెలంగాణ సేన న్యూస్.) :** మండల కేంద్రమైన ముధోల్ లో గౌడ కులస్తుల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా మోకు దెబ్బ జాతీయ అధ్యక్షులు అమరవేణి నర్సాగౌడ్ హాజరు కానున్నట్లు నియోజకవర్గ అధ్యక్షులు ఆకుల అంజి గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల భైంసా పట్టణంలోని గౌడ సంఘ భవనంలో జిల్లా గౌడ సంఘం అధ్యక్ష ఎన్నికలను నిర్వహించారు. జిల్లా అధ్యక్షులుగా చేపూరి కనక గౌడ్, కార్యనిర్వాక అధ్యక్షులుగా ముష్కం అశోక్ గౌడ్, రాష్ట్ర కోశాధికారిగా గర్గుల మురళి గౌడ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకున్న సభ్యులను బుధవారం ముధోల్ మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. గౌడ కుల సంఘం సభ్యులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# శస్త్ర పబ్లిక్ స్కూల్ లో ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు



**తెలంగాణ సేన హుజురాబాద్ ప్రతినిధి నవంబర్ 04 :** హుజురాబాద్ పట్టణంలోని శస్త్ర పబ్లిక్ స్కూల్ లో ముందస్తు కార్తీక పౌర్ణమి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు దీపాలు వెలిగించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ వేణుమాధవ్ మాట్లాడుతూ పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ద్వార తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలు, పండగ యొక్క విశిష్టత తెలుస్తుందన్నారు. విద్యార్థులతో కలిసి పండుగ వేడుకలు జరుపుకోవడం వల్ల సామూహిక ఆధ్యాత్మికత పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ముంజాల సంగీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శంషాబాద్ విమానాశ్రయంలో శృంగేరి పీఠాధిపతులకు ఘన వీడ్కోలు...





**నవంబర్ 4 (తెలంగాణ సేన) :** ప్రత్యేక విమానంలో శృంగేరి పీఠానికి బయల్దేరిన శృంగేరి జగద్గురువులు శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి స్వామి వారికి ఘనంగా వీడ్కోలు పలికిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నల్లకుంట శంకర మఠం ధర్మాధికారులు,తెలంగాణ శృంగేరి పీఠం బాధ్యులు అనంత విభూషిత శ్రీ దక్షిణామ్నాయ శ్రీ శారద శృంగేరి పీఠం జగద్గురువులు శ్రీ శ్రీ భారతీ తీర్థ మహాస్వామి వారి సంపూర్ణ అనుగ్రహ ఆశీస్సులతో తత్కరకమల సంజాతులు జగద్గురువులు శ్రీ శ్రీ విధుశేఖర భారతి స్వామి వారు ధర్మవిజయ యాత్రలో భాగంగా 18 రోజులు తెలంగాణ లోని హైదరాబాద్ కొంపల్లి బాసర వేములవాడ అలాగే భాగ్యనగరంలో పలు క్షేత్రాలు సందర్శించి మంగళవారం ప్రత్యేక విమానంలో స్వామి వారు శృంగేరి పీఠం బయల్దేరుతున్న నేపథ్యంలో స్వామి వారికి రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ నల్లకుంట శంకర మఠం ధర్మాధికారులు, తెలంగాణ శృంగేరి పీఠం బాధ్యులు రాధ కృష్ణ శర్మ,భక్తులతో కలిసి ఘనంగా వీడ్కోలు పలికారు.

# 6న బాసరలో పాదుకదర్శన వేడుక




**తెలంగాణ సేన నవంబర్ 05 (బాసర ప్రతినిధి ):** నిర్మల్ జిల్లా బాసర మండల కేంద్రంలో 6న గురువారం పాదుక దర్శన కార్యక్రమం ఉంటుందని రామానందచార్య సాంప్రదాయ సేవ సమితి నిర్మల్ జిల్లా కమిటీ నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శ్రీ శ్రీ శ్రీ జగద్గురు నరేంద్ర స్వామి నేతృత్వంలో జరుగుతున్న ఈ యొక్క కార్యక్రమం పవిత్ర పుణ్యక్షేత్రం తల్లి శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి క్షేత్రంలో జీఎస్ గార్డెన్ లో గురువారం ఈ కార్యక్రమం ఉంటుందని గురువారం గ్రామంలో శోబయాత్ర బస్టాండ్ నుండి పురవీధుల గుండా సిద్ద పాదుక సామాజిక కార్యక్రమంలో భాగంగా భాజా భజంత్రీలు మధ్య ఆటపాటలతో చేపట్టగా అనంతరం సామాజిక కార్యక్రమంలో భాగంగా ఉపాసిక మహిళ భక్తులకు ఏడుగురుకు ఉచితంగా ట్రస్ట్ నుండి కుట్టుమిషన్లు ప్రధానం చేయడం ఉంటుందని అదేవిధంగా ప్రవచనం కర్తలు, పాండురంగ నాన్ ఏజ్ గారిచే అనంతరం సిద్ధిపాదుక దర్శనం ఉదయం తొమ్మిది నుండి ఆరు గంటల వరకు ఉంటుందని, ఈ కార్యక్రమానికి మన రాష్ట్రం నుండే కాకుండా కర్ణాటక మహారాష్ట్ర నుండి పదివేల మంది భక్తులు పాల్గొంటారని ప్రవచన దర్శన అనంతరం భక్తులకు ఉచిత మహా అన్నదాన కార్యక్రమం ఉంటుందని ఈ కార్యక్రమాన్ని అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు

# ఉపాధిహామీ నిధుల గోల్ మాల్ చేసిన సిబ్బంది

సామాజిక తనిఖీలో బట్టబయలైన ఉపాధి సిబ్బంది అవినీతి

ఉపాధిహామీ నిధులను తుంగలో తొక్కి మైనర్ పిల్లలతో పని చేయించిన వైనం





**ముధోల్:నవంబర్ 04:తెలంగాణ సేన న్యూస్** ముధోల్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణంలో మంగళవారం ఉపాధిహామీ సామాజిక తనిఖీల గ్రామసభ ఏర్పాటు చేయడం జరిగింది. గత వారం రోజుల నుండి నిర్వహించిన ఉపాధిహామీ సామాజిక తనిఖీల్లో సిబ్బంది చేసిన అవినీతి బట్టబయలైంది.నిరుపేదలకు ఉపాధి కల్పించాలనే ధ్యేయంతో ప్రభుత్వం చేస్తున్న మంచి పథకాలను అధికారులు,సిబ్బంది కలిసి ప్రభుత్వ సొమ్మును నిర్వీర్యం చేశారు.ప్రతి ఏటా ఇదే తంతు జరుగుతూ వస్తోన్న వారు ఉపాధిహామీ సిబ్బంది రూపొందించిన రికార్డులతో క్షేత్ర స్థాయిలో జరిపిన సర్వేకి పొంతన లేకుండా ఉందని తనిఖీలు చేసిన అధికారులు తెలిపారు.పని చేసి కడుపు నింపుకునే పేదలను ఆసరా చేసుకుని బతికే వారి వద్ద నుండి వారానికి 100 నుండి 200 రూపాయలను వసూలు చేసినట్లు తనిఖీలో బయటపడినట్లు సిబ్బంది తెలిపారు.అంతే కాకుండా హాజరు శాతం వేసే బుక్ ల కొరకు సైతం సుమారు 80 ఉపాధిపనికొచ్చిన కూలీల వద్దనుండి తలో 100 రూపాయలు వసూలు చేసినట్లు తనిఖీలో బయటపడినట్లు పేర్కొన్నారు.ఐతే బుక్ ల కొరకు డబ్బులు తీసుకున్న వారి పేర్లను తనిఖీ అధికారులు బట్టబయలు చేస్తలేరు.6 వ తేదీన జరిగే ప్రజావేదికలో ఉన్నతాధికారుల సమక్షంలో తనిఖీ నివేదిక పెడతామన్నారు.తనిఖీకి వచ్చిన అధికారులకు ఉపాధిసిబ్బంది రూపొందించిన రికార్డుల్లో మరెన్నో కీలక విషయాలు బయటపడ్డాయి.ముఖ్యంగా పనికి రాని వారి పేరిట డబ్బులు వేసినట్లు బయటపడింది. ఎప్పోల్ల యశోద అనే జ్యోతిబా పూలే గురుకులంలో పనిచేసే అటెండర్ పేరిట సైతం పనికొచ్చినట్లు మస్టర్లో చూయిస్తూ 3780 రూపాయలు ఆమె అకౌంట్ లో వేయించారు.పనికొచ్చిన కొందరి అటెండెన్స్ వేయక వారిని కార్యాలయం చుట్టూ తిప్పుకుంటూ ముప్పుల పాలు చేస్తున్నారు.ఉపాధిహామీ నిధులను పక్కదోవ పట్టించిన వారి వద్దనుండి నిధులు వెనక్కి తీసుకోవడంతో పాటు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

జిల్లా కమ్యూనిటీ హెల్త్ సుపర్వైజర్ డా. సురేష్





**ముధోల్:నవంబర్ 04:తెలంగాణ సేన న్యూస్. :** ముధోల్:ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని. నిర్మల్ జిల్లా కమ్యూనిటీ హెల్త్ సువర్వైజర్ డా. సురేష్ పేర్కొన్నారు.మంగళవారం ముధోల్ కమ్యూనిటీ హాస్పిటల్ ను ఆకస్మికంగా సందర్శించారు. ఇందులో భాగంగా ప్రజలకు అందుతున్న సేవలు గురించి, సిబ్బంది సమయ పాలన, ఫార్మసీ లో అందుబాటులో మందుల వివరాలు అడిగి తెలుసుకోన్నారు .అలాగే కంటి సమస్యలతో వచ్చిన రోగులకు డా. సురేష్ సార్ స్వయంగా పరీక్షించడం జరిగింది రోగులకు మరాఠీ భాషలో మాట్లాడి రోగులకు ధైర్యం చెప్పడంతో రోగులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరిండెంట్ డా అనిల్ జాదవ్ , డా. మల్లికార్జున్ డా. వనజ, స్త్రీ వైద్య నిపుణురాలు నర్సింగ్ ఆఫీసర్ సరోజా, మ్యాక కల్పన, హాస్పిటల్ సీనియర్ అసిస్టెంట్ దేవేందర్, టీబీ సూపర్వైజర్ లాలయ్య, ఆరోగ్య మిత్ర గోపి. స్టాఫ్ నర్స్ సాయి చరణ్ హాస్పిటల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అంగడిపట్ హనుమాన్ దేవాలయం వద్ద పులిహొర పంపిణీ




**తెలంగాణసేన :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ అంగడిపట్ హనుమాన్ దేవాలయం వద్ద మంగళవారం ఆర్యవైశ్య యువ నాయకుడు ప్రముఖ వ్యాపారవేత్త పొద్దుటూరి విజయ్ శరణ్య దంపతుల ఆధ్వర్యంలో పులిహొర పంపిణీ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న గజ్వేల్ మాజీ ఉప సర్పంచ్ నంగునూరి సత్యనారాయణ మాట్లాడుతూ అన్నదానం మహాదానమని ప్రతి మంగళవారం దాతల సహకారంతో పులిహొర పంపిణీ చేయడం జరుగుతుందని అందులో భాగంగా పొద్దుటూరి విజయ్ శరణ్య దంపతుల సౌజన్యంతో పులిహొర పంపిణీ చేయడం జరిగిందని ప్రతి ఒక్కరూ దైవభక్తి,సేవా భావం కలిగి ఉండాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు మల్యాల భద్రయ్య, వెంకటేష్, కాశీనాథ్, కైలాస ప్రశాంత్,కాపర్తి సంతోష్,దుర్గం, గందే సంతోష్, తదితరులు పాల్గొన్నారు

# వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో కార్తీక మాసం పూజలు



**తెలంగాణసేన :** యాదగిరిగుట్ట భువనగిరి జిల్లా (కైలాసపురం) కాచారంలో వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో మంగళవారం కార్తీక వైకుంఠ చతుర్దశి సందర్భంగా ఆలయంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు వాసవి ఉపాసకులు ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ప్రముఖ వ్యాపారవేత్త హైదరాబాద్ సముద్రాల ఆంజనేయులు శోభారాణి పాల్గొని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు, ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్న విలేకరులకు సన్మానం చేసిన డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి, ఈ కార్యక్రమంలో మార్కండేయ భక్తులు రఘునాథపురం వాస్తవ్యులు శ్రీ భోగ పాండురంగం భోగ వెంకటేశం ఆలేరు వాస్తవ్యులు సామల కిష్టయ్య వరంగల్ జిల్లా వాస్తవ్యులు సుశీల లావణ్య సువర్ణ తదితరులు పాల్గొన్నారు. ఈరోజు అన్నదాత. సముద్రాల నవీన్ కుమార్ స్వాతి అంబికా దర్బారు డీలర్ ఉప్పల్ వాస్తవ్యులు, పెద్ద ఎత్తున భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# కల్వర్టు వద్ద తృటిలో తప్పుతున్న ప్రమాదాలు

ఇరువైపులా మట్టిని పోసి ముందస్తు ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు





**కొత్తగూడ తెలంగాణ సేన. :** మహబూబాబాద్ జిల్లా భూపతి పేట చెక్ పోస్ట్ నుండి ఎల్లాపూర్ మార్గమధ్యలో గత రెండేళ్ల క్రితం కల్వర్టు ను నిర్మించి చుట్టూ ఇరువైపులా లెవెల్ మట్టిని మర్చిపోయిన సదర్ కాంట్రాక్టర్ ప్రమాదపు అంచుల్లో పలు వాహనాలు జిల్లా కేంద్రం మహబూబాబాద్ నుండి ఏజెన్సీ ప్రాంతం పాకాల కొత్తగూడ %డ% గంగారం ఉమ్మడి మండలాలకు ప్రయాణికులు రావాలంటే వాహనాలు పరిస్థితి అగమ్య గోచరంగా ఉంది త్రుటిలో స్కూల్ వ్యాన్ బోల్తాపడే ప్రమాదం తప్పింది 43 మంది సురక్షితంగా బయటపడి ఊపిరి పీల్చుకున్నారు. అత్యవసర విభాగంలో భాగంగా అంబులెన్స్ ప్రయాణం కూడా బ్రేకులు పడే పరిస్థితి వచ్చింది.. ఏజెన్సీ మండలాలకు ప్రభుత్వ కార్యక్రమాల విధులలో భాగంగా జిల్లా కేంద్రం నుండి కలెక్టర్లు జిల్లా ఎస్పీ డిఎస్పీ డిఎంహెచ్ఓ ప్రజా ప్రతినిధులు ఉన్నత అధికారులు కొత్తగూడ గంగారం రావాలంటే ఇదే ప్రధాన రహదారి కావడం విశేషం. ఇంత ప్రమాదం అంచుల్లో ఉన్న కల్వర్టు ను చూసి ప్రజా ప్రతినిధులు అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు వాపోతున్నారు ఇకనైనా మేల్కొని కల్వర్టు కు ఇరువైపులా మట్టిని పోసి లెవెల్ చేయాలని ముందస్తుగా ప్రమాదాలు జరగకుండా వాహనాలకు ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని వాహనదారులు ప్రజలు కోరుకుంటున్నారు

# వ్యాపారంలో మహిళలు రాణించాలి



**నర్సంపేట డివిజన్ తెలంగాణ సేన :** ప్రతి మహిళ అభివృద్ధి కొరకు వ్యాపార మార్గాలను నైపుణ్య శిక్షణల ద్వారా ఎంచుకోవాలని నర్సంపేట చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్టు అధికారి కే మధురిమ మరియు FMM సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ అన్నారు. తేదీ 04 నవంబర్ 2025 మంగళవారం రోజున ప్రతిభా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ వరంగల్ వారి సహకారంతో నర్సంపేటలో నిరుపేద మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమం సంస్థ అధ్యక్షులు గిరిగాని సుదర్శన్ గౌడ్ అధ్యక్షత వహించగా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన కే మధురిమ మాట్లాడుతూ సమాజంలో ప్రతి మహిళ కుటుంబ అభివృద్ధికి తన పాత్ర పోషిస్తుందని అంతేగాక కాకుండా ఆర్థిక ప్రగతి సాధించడానికి ప్రతి మహిళ కూడా నైపుణ్య శిక్షణలు తీసుకొని, అనంతరం వ్యాపార మార్గాలు ఎంచుకొని ఆర్థిక అభివృద్ధికి దోహదపడాలని తెలిపారు అంతేకాకుండా నైపుణ్య శిక్షణను పొందిన ప్రతి మహిళలకు ప్రభుత్వ పరంగా కూడా అనేక పథకాలు అందుబాటులో ఉన్నాయని వాటిని కూడా సద్వినియోగం చేసుకొని తమ వ్యాపారం మార్గాలను ఎంచుకోవాలని సూచించారు ఈ యొక్క కార్యక్రమంలో హాజరైన సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ మాట్లాడుతూ నిరుపేద మహిళలకు ,ఆదరణ లేని మహిళలకు ఇటువంటి నైపుణ్య శిక్షణ అందించడం అనేది సంస్థ ప్రాథమిక ఉద్దేశం అని తద్వారా కుటుంబ సమగ్ర అభివృద్ధి కొరకు ఎంతో వీలు అవుతుందని తెలిపారు ఈ యొక్క కార్యక్రమం నందు ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్లు బత్తుల కరుణా, ఎర్ర శ్రీకాంత్ శ్రీకాంత్, ఫైనాన్స్ మేనేజర్ అజయ్ కుమార్,ప్రతిభ స్వచ్ఛంద సంస్థ వైస్ ప్రెసిడెంట్ %దీ%.వెంకటేష్, స్వయంకృషి ఎన్జీవో ప్రతినిధి బెజ్జంకి ప్రభాకర్ ట్రైనర్ శ్వేత అంగన్వాడి టీచర్ గొర్రె రాధ తదితరులతో పాటు సుమారు 30 మంది మహిళలు హాజరు కావడం జరిగింది ఈ సందర్భంగా సిడిపిఓ మధురిమ మరియు బాధ్యుల ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది.

# అమర వీరుల ఆశయాలను కొనసాగిద్దాం

### నవంబర్1నుండి9వరకు అమర వీరుల సంస్మరణ సభలు జరుపండి

### సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ



**మహబుబాబాద్ జిల్లా తెలంగాణ సేన నవంబర్ 4 :** సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం రోజున బయ్యారం మండలం గురిమెళ్ళ గ్రామంలో గల బట్టు అంజన్న(సురేషన్న) సైదులన్న స్మారక స్థూపంపై పార్టీ గ్రామ కార్యదర్శి తోలెం నర్సన్న జెండా ఆవిష్కరించి అమరవీరుల సంస్మరణ సభ జరుపడం జరిగింది. అఖిల భారత రైతు కూలీ సంఘం( మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బండపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో భారత కార్మిక సంఘాల సమాఖ్యరాష్ట్ర ఉపాధ్యక్షులు . మదార్ పాల్గొని మాట్లాడుతు భారత విప్లవోద్యమ చరిత్రలో అనేక మంది కమ్యూనిస్టు విప్లవ కారులు విప్లవోద్యమ నిర్మాణం కోసం,ప్రజల కోసం తమ అమూల్యమైన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని, అన్నారు. నవంబర్ నెలలోనే కమ్యూనిస్టు విప్లవ కారులైన అగ్రశ్రేణి నాయకులు, కార్యకర్తలు అమరులైనారని అన్నారు. మార్క్సిజం. లెనినిజం. మావో ఆలోచనా విధానాన్ని మార్గ దర్శకంగా తీసుకొని నక్సల్బరి,శ్రీకాకుళ రైతాంగ పోరాటాలు ముందుకు వచ్చాయని,ఈపోరాటాల ప్రభావంతో ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో గోదావరి లోయ విప్లవోద్యమానికి పునాదులు వేశారని,ఈ విప్లవోద్యమ స్ఫూర్తితో అనేక మంది ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించి ప్రజల తరపున నిలబడి వారి హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేశారని అన్నారు.ప్రభుత్వం ఉద్యమాలను ఉక్కు పాదంతో అణిచి వేయాలని అనేక కుట్రలు పన్ని ఎంతోమంది విప్లవ కారులను నిర్దాక్షిణ్యంగా,క్రూరంగా కాల్చి చంపిందని అన్నారు.విప్లవ కారుల నాయకత్వంలో పది లక్షల ఎకరాలకు పైగా పోడు భూములను ప్రజలకు సాధించి పెట్టిన చరిత్ర కమ్యూనిస్టు విప్లవ కారులకు ఉందన్నారు అమర వీరులను స్మరించుకుంటు సంస్మరణ సభలు జరుపు కోవడం అంటే వారి,త్యాగాలను,ఆశయాలను ముందుకు తీసుకు వెల్లడం.అమర వీరులను స్మరించుకుంటూ ప్రతిఘటన ఉద్యమాలను,నిర్మించినప్పుడు మాత్రమే వారికి నిజమైన నివాళులు,అర్పించిన,వారం,అవుతామని వారు అన్నారు. న్యూ డెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా, నవంబర్,1 నుండి 9వరకు గ్రామ, గ్రామాన అమరవీరుల సంస్మరణ సభలు జరుపాలని పార్టీ శ్రేణులకు,ప్రజలకు పిలుపునిచ్చారు. ఇంకా ఈకార్యక్రమంలో పార్టీ,ప్రజా సంఘాల మండల,జిల్లా నాయకులు, తోలెం కార్తీక్. నవీన్. సమ్మయ్య. వీరన్న.భద్రయ్య తదితరులు పాల్గొన్నారు

# కేవలం రూ.20లకే వైద్యం

# ఈ డాక్టర్ అచ్చం ఆ సినిమానే గుర్తుచేస్తున్నారుగా!



### నామమాత్రపు ఫీజుతో వైద్యం అందిస్తూ నేటి సమాజానికి స్ఫూర్తి

### - ప్రభుత్వ వైద్యుడిగా అవకాశాలు తలుపు తట్టినా కాదని ప్రజల సేవ దిశగా

### - సూర్యాపేట జిల్లాలో ప్రజావైద్యుడిగా పేరొందిన డాక్టర్ కొప్పుల రంగారెడ్డి

తెలంగాణసేన : మనం ఓ సినిమాలో డాక్టర్ కేవలం రూ.5 తీసుకుని పేద ప్రజలకు వైద్యం అందించడం చూసాం. అది సినిమాలో చూడగానే అబ్బా నిజంగా డాక్టర్లు ఇలా ఉండే ఎంత బాగుంటుందో అనే భావన ప్రతి ఒక్కరిలో కలగడం సహజం. అలాంటి సంఘటనే ఇప్పుడు మనం చూడబోయే కథనం. రూ.20ల డాక్టర్ స్టోరీ

అనారోగ్యానికి గురై ప్రైవేటు ఆసుపత్రికి వైద్యం కోసం వెళ్తే ఫీజు రూపంలో వందల్లో తీసుకునే ఇప్పటి రోజుల్లో నామమాత్రపు ఫీజుతో వైద్యం అందిస్తూ నేటి సమాజానికి గొప్ప స్ఫూర్తిగా నిలుస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో ప్రజావైద్యుడిగా పేరొందిన డాక్టర్ కొప్పుల రంగారెడ్డి. సూర్యాపేట జిల్లాలోని ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలో మధ్యతరగతి రైతు కుటుంబంలో జన్మించిన రంగారెడ్డి తాను సెలవు దినాల్లో పొలం పనులు చేస్తూ పశువులను మేపుతూ పాఠశాల విద్యాభ్యాసం పూర్తిగా సొంతూరిలోనే పూర్తి చేశారు.

బంధువుల్లో అనారోగ్యం చూసి డాక్టర్ : ఆ సమయంలో చుట్టు పక్కల ప్రజలు, తమ బంధువులు కొందరు అనారోగ్యానికి గురవడం ఆ సమయంలో సరైన వైద్యం అందని పరిస్థితులను నేరుగా కళ్లతో చూసిన తాను డాక్టర్ కావాలనే లక్ష్యాన్ని ఏర్పరచుకున్నారు. పట్టుదలతో చదివి హైదరాబాద్ లోని గాంధీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ విద్యను పూర్తి చేశారు. వైద్యవృత్తిలో పనితీరును మెరుగుపరచుకోవడానికి అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలు పర్యటించారు. కానీ ఆపై ఉన్నత పీజీ చదువులకు వెళ్లలేదు. ప్రభుత్వ వైద్యుడిగా అవకాశాలు తలుపు తట్టినా వాటన్నింటిని కాదని వదులుకున్నారు. చిన్ననాడే నిర్ణయించుకున్నట్లుగా 1983 నుంచి 84 మధ్య కాలంలో సూర్యాపేటలో ఓ ఆసుపత్రిని ప్రారంభించి పేదల కోసం వైద్యసేవలను శ్రీకారం చుట్టారు.

రూ.3 ఫీజుతో మొదలు : తన వంతుగా పేదలకు కాస్తయినా సాయపడాలన్న ఉద్దేశంతో నామమాత్రపు ఫీజు తీసుకుంటూ వైద్య సేవలందిస్తున్నారు. దాదాపు 40 ఏళ్ల నుంచి వైద్య వృత్తిలో రాణిస్తున్న కొప్పుల రంగారెడ్డి తనకు సంపాదన ముఖ్యం కాదని, రోగుల సేవే ప్రధానమంటూ తొలుత రూ.3 ఫీజుతో సేవలను ప్రారంభించి క్రమంగా రూ.5, రూ.7, రూ.10 ఇప్పుడు రూ.20 ఫీజును నామమాత్రంగా తీసుకుంటున్నారు.

చికిత్స కోసం నిత్యం సగటున 50 మంది : మొదటి నుంచి అద్దె భవనంలో రెండు పడకల ఆసుపత్రిని నిర్వహిస్తున్న వైద్యులు రంగారెడ్డి తన వద్దకు నిత్యం సగటున 50 మంది ట్రీట్‌మెంట్ కోసం వస్తున్నారని తెలిపారు. ఫీజు ఇవ్వలేని వారుంటే వారికి ఉచితంగానే చికిత్స అందిస్తున్నారు. తమ ఇళ్లలో ఎవరికైనా సుస్తీ చేసిందంటే డాక్టర్ రంగారెడ్డి ఒక్కసారి నాడి పడితే నయం అవుతుందని గట్టి నమ్మకమని అక్కడ వైద్యానికి వచ్చిన సంజీవ, లక్ష్మి, సునీత అనే మహిళలు చెప్పారు.

# 85% సీట్ల కేటాయింపుపై టీ-జూడా హర్షం



**తెలంగాణసేన , హైదరాబాద్, నవంబర్ 4:** మెడికల్ పీజీ మేనేజ్‌మెంట్ కోటాలో 85 శాతం సీట్లను రాష్ట్ర విద్యార్థులకు కేటాయిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై టీ-జూడా రాష్ట్ర అధ్యక్షుడు ఐజాక్ న్యూటన్ హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు మంగళవారం టీ-జూడా ప్రతినిధులు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ దవాఖానల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ అజయ్‌కుమార్, చైర్‌పర్సన్ మదన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రీయ విద్యాలయంలో జంజాతీయ గౌరవ్ దివాస్ పక్వాడ వేడుకలు

### గిరిజన సంప్రదాయ హస్త కళా ప్రదర్శన

### విద్యార్థులను ప్రశంసించిన ప్రిన్సిపాల్ ముఖేష్ కుమార్




**మహబూబాబాద్ జిల్లా తెలంగాణ సేన నవంబర్ 4 :** మహబుబాబాద్ జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయ మంగళవారం జంజాతీయ గౌరవ్ దివాస్ సందర్భంగా విద్యార్థులు గిరిజన సంప్రదాయక కళా ప్రదర్శనలు, కళా ఖండాలను,గిరిజన నృత్యాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కేంద్రీయ విద్యాలయ ఇంచార్జీ ప్రిన్సిపల్ ముఖేష్ కుమార్ ప్రశంసించి ఈ సందర్భంగా మాట్లాడారు. నవంబర్ 1నుంచి 15 వరకు గిరిజనుల గౌరవం, వారసత్వ, వారు దేశం కోసం చేసిన త్యాగలను స్మరిస్తూ కేంద్రీయ విద్యాలయం లో మహబూబాబాద్ లో కార్యక్రమాలు క్విజ్ లు గిరిజన సంప్రదాయ హస్త కళా ప్రదర్శనలు ఉంటాయని ప్రిన్సిపాల్ తెలిపారు. రెండు వారాల పాటు వివిధ కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. స్వతంత్ర్య పోరాట యోధుడు , గిరిజన నాయకులు భగవాన్ బిర్సా ముండా నవంబర్ 15న ఆయన జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమాలు కొనసాగుతాయని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

# పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటిన సెవెన్ హిల్స్ ప్రిన్సిపల్ ఆంజనేయులు



**తెలంగాణసేన :** సిద్దిపేట జిల్లా ములుగు మండలం కొత్తూరు గ్రామంలో సెవెన్ హిల్స్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆంజనేయులు జన్మదినం పురస్కరించుకుని గ్రీన్ ఇండియా హరితసేన రాష్ట్ర కో ఆర్డినేటర్ రాజేశ్వర్ రావు, సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ సినీ హీరో అనిల్ మొగిలి ఆధ్వర్యంలో సెవెన్ హిల్స్ స్కూల్ ప్రాంగణం లో మూడు మొక్కలు నాటారు, అనంతరం ప్రిన్సిపాల్ ఆంజనేయులు మాట్లాడుతూ ఇలాంటి గొప్ప కార్యక్రమం తీసుకొచ్చిన మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని, పర్యావరణ పరిరక్షణ కు చెట్లు దోహదపడతాయని అన్నారు, ఈ కార్యక్రమంలో సెవెల్ హిల్స్ స్కూల్ కరస్పాండెంట్ సువర్ణ, గ్రీన్ ఇండియా హరితసేన కొత్తూరు కోఆర్డినేటర్ శ్రీకాంత్, స్కూల్ అధ్యాపక బృందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# డాక్టర్ జలదంకి వెంకటనారాయణ చారి వారి దశదిన కర్మ కార్యక్రమం లో పాల్గొని నివాళులర్పించిన కొత్తగూడ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు





**కొత్తగూడ తెలంగాణ సేన :**ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో మెరుగు శ్రీనివాస్ జర్నలిస్ట్ వారి బావమరిది డాక్టర్ జలదంకి వెంకటనారాయణ చారి ఇటీవల అనారోగ్యంతో స్వర్గస్తులైనారు నేడు మహబుబాబాద్ జిల్లా కేంద్రం వారి స్వగృహంలో దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన తెలంగాణ రాష్ట్ర రూరల్ డెవలప్మెంట్ డైరెక్టర్ తెల్ల నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొత్తగూడ వజ్జ సారయ్య గంగారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జాడి వెంకటేశ్వర్లు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ రూప్ సింగ్ బీరెల్లి సతీష్‌నరేందర్, అనంతరావు తోలం నరసయ్య తదితరులు పాల్గొన్నారు

# సమస్యల పరిష్కారానికి కృషి

### - ఎస్ ఎస్ రావు



**సనత్ నగర్, తెలంగాణ సేన న్యూస్:** అమీర్పేట్ డివిజన్ స్థానిక ప్రజలు వారికి సంబంధించిన సమస్యలను కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎస్ఎస్ రావు దృష్టికి తీసుకురాగా అనుకూలంగా స్పందించి సమస్య పరిష్కారం అయ్యే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూహైదరాబాద్ నగరంలోనే కాకుండా తెలంగాణ వ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకమైన, భక్తులకు కొంగు బంగారమైన బల్కం పేట్ ఎల్లమ్మ తల్లి ఆలయం. సత్యం థియేటర్ చౌరస్తాకు సమీపంలో ఉన్న సోను భాయి ఆలయం సమీపంలో మరొక వైన్ షాప్.ఈ రెండు వైన్ షాప్ లు ఏర్పాటు చెయ్యడం వలన భక్తులు ముఖ్యంగా మహిళలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.మరియు జిబాపు నగర్ లో రోడ్డు పక్కన ఇంకొక వైన్ షాప్ వల్ల తాగుబోతులు ఇష్టారాజ్యంగా తాగి రోడ్డుపైనే వ్యవహారిస్తున్న ఘటనలు కోకొల్లలుగా చూస్తున్నాము. అంతే కాదు ఇటీవల ఒక మీడియా రిపోర్టర్ సైతం ఈ తాగుబోతుల వల్లే యాక్సిడెంట్ కు గురై మరణించిన ఘటన విదితమే...ఈ సందర్భంగా కొంతమంది సామాజిక వేత్తలు ఆలయాల వద్ద, రోడ్డు పక్కన వైన్ షాప్ ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ చేస్తున్న ఆందోళనకు అమీర్ పేట్ డివిజన్ కాంగ్రెస్ తరపున సంపూర్ణ మద్దత్తు ప్రకటిస్తున్నాము. అటువంటి వైన్ షాప్ లు ఏర్పాటు చెయ్యకుండా వారుచేస్తున్న పోరాటంలో మేము కూడా భాగస్వాములం అవుతాము అన్నారు.

# వాస్తవంగా ఏం జరిగిందో తెలియదు

**వైఎస్సార్సీపీ ఇచ్చిన స్క్రిప్టే చదివాను**

**యాంకర్ శ్యామల**

**బస్సు ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై అవాస్తవాలు ప్రచారం**

**పలువురికి నోటీసులు**

**వైఎస్సార్సీపీ అధికార ప్రతినిధులు ఆరే శ్యామల, కారుమూరి వెంకటరెడ్డి సహా పలువురిని విచారించిన పోలీసులు**



కర్నూలు బస్సు ప్రమాద దుర్ఘటనకు అసలు కారణాలు తనకు తెలియవని వైఎస్సార్సీపీ ప్రతినిధులు ఇచ్చిన స్క్రిప్టే చదివానని ఆ పార్టీ అధికార ప్రతినిధి శ్యామల తేల్చిచెప్పారు. బస్సు ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారన్న కారణంతో కర్నూలు తాలూకా అర్బన్ పోలీసు స్టేషన్లో 27 మందిపై గత నెల 30న కేసు నమోదైన విషయం తెలిసిందే. వారిలో పలువురికి నోటీసులు పంపగా వైఎస్సార్సీపీ అధికార ప్రతినిధులు ఆరే శ్యామల, కారుమూరి వెంకటరెడ్డి, రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ ప్రతినిధి టి.నాగార్జునరెడ్డి, వైఎస్సార్సీపీ అభిమాని నవీన్, సీవీ రెడ్డిలను పోలీసులు సోమవారం విచారించారు. యాంకర్ శ్యామలను గంటన్నరపాటు విచారించారు.పోలీసుల విచారణ- శ్యామల సమాధానాలు : ప్రమాదానికి ముందు శివశంకర్, అతడి మిత్రుడు ఎర్రిస్వామిలు బెల్టు దుకాణంలోని మద్యం తాగారని ఎవరు చెప్పారు? అని పోలీసులు ప్రశ్నించగా దానికి తగిన ఆధారాలున్నాయా? ఉంటే చూపాలంటూ పలు ప్రశ్నలు అడిగేసరికి ఆమె నీళ్లు నమిలారు. కర్నూలు డీఎస్పీ బాబూప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు సీఐలు, మహిళా ఎస్సై సమక్షంలో ఆమెను ప్రశ్నించారు. అవాస్తవాలు ఎందుకు ప్రచారం చేశారని అడగ్గా వైఎస్సార్సీపీ అధికార ప్రతినిధి కావడంతో వారిచ్చిన స్క్రిప్ట్ ఆధారంగానే పార్టీ ఆదేశాల మేరకు చదివానని వెల్లడించినట్లు తెలిసింది.

**లోపల ఒకలా - బయటకు వచ్చి మరోలా వ్యాఖ్యలు**

విచారణ అనంతరం బయటకు వచ్చిన శ్యామల మీడియాతో మాట్లాడుతూ నాడు తాడేపల్లి వైఎస్సార్సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తాను వైఎస్సార్సీపీ అధికార ప్రతినిధిగా పది ప్రశ్నలు అడిగానని, వాటిలో తప్పేముందని ప్రశ్నించారు. ఆ ప్రశ్నలకు తెలుగుదేశం పార్టీ నాయకులు సమాధానం చెప్పకుండా కేసులు పెట్టడమేంటన్నారు. ఎన్ని కేసులు పెట్టినా, విచారణల పేరుతో ఎన్నిసార్లు తిప్పినా తన పోరాటం ఆపనని శ్యామల చెప్పారు. అయితే, పోలీసు విచారణ నిమిత్తం శ్యామల, కారుమూరి వెంకటరెడ్డి తదితరులు కర్నూలు డీఎస్పీ కార్యాలయానికి రాగా, మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎస్వీ మోహన్‌రెడ్డి, పలువురు వైఎస్సార్సీపీ కార్యకర్తలు వారివెంట వచ్చి హడావుడి చేశారు. చలో కర్నూలు పేరుతో వైఎస్సార్సీపీ కార్యకర్తలతో కలిసి రావడంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయని పోలీసులు వివరించారు.

**బస్సు ప్రమాదం మిగిల్చిన విషాదం- శోకసంద్రంలో కుటుంబాలు**

కర్నూలు జిల్లా చిన్నటేకూరు వద్ద అక్టోబర్ 24న తెల్లవారుజామున చోటు చేసుకున్న ఘోర బస్సు ప్రమాదం రాష్ట్రాన్ని విషాదంలో ముంచింది. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్తున్న వేమూరి కావేరి ట్రావెల్స్ ప్రైవేట్ బస్సును బైక్ ఢీకొట్టడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు బస్సు మొత్తాన్ని చుట్టుముట్టాయి. ప్రయాణికులు గాఢనిద్రలో ఉండటంతో తేరుకునేలోపే బస్సు దగ్ధమైపోయింది. ఈ ప్రమాదంలో 19మంది సజీవ దహనమయ్యారు. మృతులను గుర్తించడానికి రెండు,మూడు రోజుల సమయం పట్టిన సంగతి తెలిసిందే. ఈ రోడ్డు ప్రమాద ఘటనపై వైఎస్సార్సీపీ అసత్య ప్రచారాలు చేసిన సంగతి విధితమే.

# విద్యార్థినులతో కాళ్లు నొక్కించుకున్న మహిళా టీచర్

**శ్రీకాకుళం గిరిజన పాఠశాలలో టీచర్ నిర్వాకం**

**క్లాస్ రూంలో ఫోన్ మాట్లాడుతూ విద్యార్థినులతో సేవలు**

**విచారణకు ఆదేశించామని తెలిపిన ఉన్నతాధికారులు**



పిల్లలకు పాఠాలు చెప్పాల్సిన ఓ టీచర్ విద్యార్థినులతో సేవలు చేయించుకుంది.. తరగతి గదిలో కుర్చీలో తీరిగ్గా కూర్చుని ఫోన్ మాట్లాడుతూ పిల్లలతో కాళ్లు నొక్కించుకుంది. శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలం బందపల్లి బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో చోటుచేసుకుంది ఘటన. దీనికి సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. టీచర్ నిర్వాకంపై విద్యార్థినుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటన జరిగి చాలా రోజులు అవుతోందని, ఆలస్యంగా వీడియో బయటకు రావడంతో టీచర్ నిర్వాకం వెలుగు చూసిందని విద్యార్థినులు చెబుతున్నారు. ఈ ఘటనపై ఐటీడీఏ సీతంపేట పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ స్పందిస్తూ.. ఆ టీచర్ కు ఇప్పటికే షోకాజ్ నోటీసు జారీ చేశామని తెలిపారు. విద్యార్థినులతో టీచర్ కాళ్లు పట్టించుకున్న ఘటనపై విచారణకు ఆదేశించినట్లు వివరించారు.

# రాష్ట్రంలో దళిత ఉద్యమం నిర్మిస్తాం

**మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్**

**రాష్ట్రంలో దళిత ఉద్యమాన్ని తీసుకొస్తామన్న కొప్పుల**

**కాంగ్రెస్ ప్రభుత్వం దళిత వ్యతిరేకి అని విమర్శ**

**జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపు**

**ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపణ**

**అంబేద్కర్ విగ్రహాన్ని ప్రభుత్వం బంధించిందని వ్యాఖ్య**



కాంగ్రెస్ ప్రభుత్వం దళితుల వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని, దీనికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా దళిత ఉద్యమాన్ని నిర్మిస్తామని తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ హెచ్చరించారు. జూబ్లీహిల్స్‌లో దళితులను ఓటు అడిగే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదని, అక్కడి దళితులు కాంగ్రెస్ నేతలను నిలదీయాలని ఆయన సూచించారు. ఈ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి కచ్చితంగా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం దళిత వర్గాలను తీవ్రంగా అవమానిస్తోందని, ఎన్నికల ముందు మల్లిఖార్జున ఖర్గేతో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను విడుదల చేసి ఇప్పుడు ఆ హామీలను విస్మరించిందని అన్నారు. "గరీబీ హఠావో నినాదం నుంచి నేటి వరకు కాంగ్రెస్ పార్టీ దళితులను మోసం చేస్తూనే ఉంది. వారిని కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటోంది" అని కొప్పుల ఆరోపించారు.దళితులకు ఇచ్చిన హామీలపై ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఒక్కసారైనా సమీక్ష నిర్వహించారా? అని ఆయన ప్రశ్నించారు. దళితబంధును రూ. 12 లక్షలకు పెంచుతామని చెప్పి మోసం చేశారని, ఇందిరమ్మ ఇళ్లను కేవలం కాంగ్రెస్ కార్యకర్తలకే పరిమితం చేస్తున్నారని విమర్శించారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను ప్రభుత్వం దారి మళ్లిస్తోందని తీవ్ర ఆరోపణలు చేశారు. "ప్రభుత్వం 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని బంధించింది. ముఖ్యమంత్రి గానీ, మంత్రులు గానీ అక్కడ నివాళులు అర్పించిన పాపాన పోలేదు" అని కొప్పుల ఈశ్వర్ ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో పాల్గొన్న దళితబంధు సాధన సమితి అధ్యక్షుడు మహేశ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అంటేనే దళిత వ్యతిరేకి అని అన్నారు. దళితబంధు సాధన సమితి తరఫున జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆయన తెలిపారు.

# ఫ్రెండ్స్‌తో కలిసి డ్రగ్స్ అమ్మకాలు

**డాక్టర్ ఇంట్లో రూ.3 లక్షల విలువైన మత్తుపదార్థాలు స్వాధీనం**

**వైద్యుడి ఇంట్లో రూ.3 లక్షల విలువైన డ్రగ్స్ పట్టివేత**

**వైద్యుడు జాన్‌పాల్ అరెస్టు, మరో ముగ్గురిపై కేసు నమోదు**

**ఓజీ కుష్, ఎండీఎంఏ, కొకైన్, హాష్ ఆయిల్ స్వాధీనం**



ప్రాణాలు పోయాల్సిన వైద్యుడే ప్రాణాంతక డ్రగ్స్‌కు బానిస అయ్యాడు. మాదక ద్రవ్యాలు కొనుగోలు చేసేందుకు డబ్బు లేకపోవడంతో స్నేహితులతో కలిసి డ్రగ్స్ అమ్మకాలకు సిద్ధమయ్యాడు. దిల్లీ, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకున్న మత్తు పదార్థాలను తాను అద్దెకు ఉంటున్న ఇంట్లో పెట్టుకొని విక్రయించడం ప్రారంభించాడు. ఇలా వచ్చిన డబ్బును స్నేహితులకు ఇస్తూ, తాను డ్రగ్స్‌ను ఉచితంగా వినియోగిస్తున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించి ఈ వ్యవహారం గుట్టు రట్టుచేశారు. నిందితుడి నుంచి రూ.3 లక్షల విలువైన మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ముషీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది.

**డాక్టర్ ఇంట్లో రూ.3 లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం :** హైదరాబాద్ నగరంలోని ముషీరాబాద్‌లో అద్దెకు ఉంటున్న జాన్‌పాల్ అనే డాక్టర్ ఇంట్లో డ్రగ్స్ విక్రయిస్తున్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. దీంతో అతడి నివాసంలో తనిఖీలు చేపట్టి రూ.3 లక్షల విలువ చేసే మత్తు పదార్థాలను ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ (స్పెషల్ టాస్క్‌ఫోర్స్) పోలీసులు పట్టుకున్నారు. జాన్‌పాల్‌ను అరెస్టు చేసి, ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న మరో ముగ్గురిపై కేసులు నమోదు చేశారు.

**పరారీలో ముగ్గురు నిందితులు :** హైదరాబాద్ నగరానికి చెందిన ప్రమోద్, సందీప్, శరత్ దిల్లీ, బెంగళూరు నుంచి డ్రగ్స్ తెప్పించి వైద్యుడు జాన్‌పాల్ ఇంట్లో ఉంచి వాటిని విక్రయిస్తున్నారు. మాదక ద్రవ్యాలు విక్రయించినందుకు గానూ డాక్టర్‌కు వీటిని ఉచితంగా ఇస్తున్నారు. అతడి ఇంట్లో ఎండీఎంఏ, ఓజీకుష్, కొకైన్, హాష్‌ఆయిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ముగ్గురు నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు వెల్లడించారు. ఈ దాడుల్లో రాష్ట్ర ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ టీం లీడర్ ప్రదీప్ రావు, ఎస్సై బాలరాజులు పాల్గొన్నారు.

# టీఇండియా గెలుపును సెలెబ్రేట్ చేసుకున్న పాకిస్థాన్ ఫ్యామిలీ

**మహిళల వన్డే ప్రపంచకప్ గెలిచిన టీమిండియా**

**భారత్ విజయంపై పాకిస్థాన్‌లో ఓ కుటుంబం సంబరాలు**

**టీమిండియా ఫొటోతో కేక్ కట్ చేసిన పాక్ ఫ్యాన్స్**

**కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ఫొటోకు కేక్ తినిపిస్తున్న వీడియో వైరల్**

**ఫైనల్లో దక్షిణాఫ్రికాను 52 పరుగులతో ఓడించిన భారత్**



భారత మహిళల క్రికెట్ జట్టు వన్డే ప్రపంచకప్ గెలిచి చరిత్ర సృష్టించింది. ఈ చారిత్రక విజయాన్ని భారత్‌తో పాటు పొరుగుదేశం పాకిస్థాన్‌లోనూ సెలబ్రేట్ చేసుకోవడం ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. టీమిండియా విజయాన్ని అభినందిస్తూ పాక్‌కు చెందిన ఓ కుటుంబం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.పాకిస్థాన్‌కు చెందిన ఓ కుటుంబం, భారత జట్టు విజయాన్ని తమ ఇంట్లో ఘనంగా జరుపుకుంది. వారంతా పాకిస్థాన్ జెర్సీలు ధరించి ఉండటం విశేషం. టీమిండియా క్రీడాకారిణుల ఫొటో ఉన్న కేక్‌ను కట్ చేసి తమ ఆనందాన్ని పంచుకున్నారు. "మహిళల వన్డే ప్రపంచకప్ గెలిచిన టీమిండియాకు అభినందనలు. భారత జట్టుకు పాకిస్థాన్ నుంచి ప్రేమ, మద్దతు" అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు.ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఈ వీడియోలు పోస్ట్ అయ్యాయి. ఇదే ఖాతాలో పోస్ట్ చేసిన మరో వీడియోలో, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఫొటోను టీవీలో చూపిస్తూ.. కొందరు చిన్నారులు, ఓ వ్యక్తి ఆమెకు కేక్ తినిపిస్తున్నట్లుగా ఉన్న దృశ్యాలు కట్టిపడేశాయి. ఈ వీడియోలపై భారత నెటిజన్లు సానుకూలంగా స్పందిస్తూ, ధన్యవాదాలు తెలుపుతున్నారు.ఇక మ్యాచ్ విషయానికొస్తే, 2025 మహిళల వన్డే ప్రపంచకప్‌ను భారత్ తొలిసారిగా కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్ పోరులో దక్షిణాఫ్రికాపై 52 పరుగుల తేడాతో హర్మన్‌ప్రీత్ సేన ఘన విజయం సాధించింది. దీంతో 47 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. గతంలో మిథాలీ రాజ్ కెప్టెన్సీలో రెండుసార్లు ఫైనల్ చేరినా, భారత్‌కు నిరాశే ఎదురైంది. కానీ ఈసారి మాత్రం పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి కప్‌ను ముద్దాడింది.ఈ మెగా టోర్నీ విజయంతో భారత మహిళల జట్టుకు రూ.39 కోట్ల ప్రైజ్‌మనీ లభించింది. దీనికి అదనంగా, భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కూడా రూ.51 కోట్ల భారీ నజరానాను ప్రకటించి క్రీడాకారిణులను అభినందించింది.


# విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో వైసీపీ నేతల వీరంగం

**జోగి రమేశ్ భార్య, కుమారులపై కేసు**

**పోలీసులను తోసేసి, ఎమర్జెన్సీ వార్డు అద్దాలు పగలగొట్టిన అనుచరులు**

**'నీ పేరు డిజిటల్ బుక్‌లో రాస్తాం' అంటూ ఎస్సైకి తీవ్ర హెచ్చరికలు**

**ఘటనకు సంబంధించిన వీడియోలను పరిశీలిస్తున్న పోలీసులు**



విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో వైకాపా నేత జోగి రమేశ్ కుటుంబ సభ్యులు, అనుచరులు సృష్టించిన గందరగోళంపై మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులపై దౌర్జన్యానికి పాల్పడటంతో పాటు, ఆసుపత్రి అద్దాలు పగలగొట్టిన ఘటనలో జోగి రమేశ్ భార్య శకుంతల, ఇద్దరు కుమారులు రాజీవ్, రోహిత్‌తో పాటు మరికొందరిని నిందితులుగా చేర్చారు.నకిలీ మద్యం కేసులో అరెస్టయిన జోగి రమేశ్, రాములను కోర్టులో హాజరుపరిచే ముందు వైద్య పరీక్షల నిమిత్తం పోలీసులు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న జోగి రమేశ్ కుటుంబ సభ్యులు, వైకాపా శ్రేణులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఆసుపత్రి ఎమర్జెన్సీ వార్డులోకి వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు వారిని అడ్డుకున్నారు.ఈ క్రమంలో వైకాపా శ్రేణులు పోలీసులతో వాగ్వాదానికి దిగి, వారిని బలవంతంగా నెట్టుకుంటూ లోపలికి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ తోపులాటలో ఎమర్జెన్సీ వార్డు ప్రవేశ ద్వారం వద్ద ఉన్న అద్దాలు పగిలిపోయాయి. "జై జోగి" అంటూ నినాదాలు చేస్తూ వారు సృష్టించిన గందరగోళంతో ఆసుపత్రి ప్రాంగణంలో ఉద్రిక్తత నెలకొంది.అక్కడ విధుల్లో ఉన్న మాచవరం ఎస్సై శంకర్ రావు వారిని అడ్డుకోగా, ఆయనపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "ఈ ప్రభుత్వం ఉండేది ఇంకో రెండేళ్లే. నీ పేరేంటి? డిజిటల్ బుక్‌లో రాస్తాం. నీ కాలర్ పట్టుకుని నిలదీస్తాం. నీకు భయం అంటే ఏంటో చూపిస్తాం" అంటూ తీవ్ర పదజాలంతో దూషించారు. ఈ గందరగోళంలో ఓ కానిస్టేబుల్ కిందపడిపోగా, అతడిని తొక్కుకుంటూ ముందుకు వెళ్లినట్లు ఆరోపణలు వచ్చాయి.ఈ ఘటనపై పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసి, పోలీసులపై దౌర్జన్యానికి పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ ఘటనపై ఏ1గా జోగి రమేశ్ భార్య శకుంతల, ఏ2గా పెద్ద కుమారుడు రాజీవ్, ఏ3గా చిన్న కుమారుడు రోహిత్‌తో పాటు మరికొందరిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఘటన జరిగిన సమయంలో తీసిన వీడియో ఫుటేజీలను పరిశీలించి, మరో 10 నుంచి 15 మందిని నిందితులుగా చేర్చే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

# తెలుగు టీవీ నటికి ఆన్‌లైన్‌లో వేధింపులు

**అంతర్జాతీయ కంపెనీ మేనేజర్ అరెస్ట్**


**టీవీ నటికి సోషల్ మీడియాలో లైంగిక వేధింపులు**

**అసభ్యకర మెసేజ్‌లు, వీడియోలు పంపిన నిందితుడు**

**హెచ్చరించినా వేధింపులు ఆపకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు**

**నిందితుడు నవీన్‌ను అరెస్ట్ చేసిన బెంగళూరు పోలీసులు**

**అంతర్జాతీయ కంపెనీలో డెలివరీ మేనేజర్‌గా గుర్తింపు**





బెంగళూరులో ఓ టీవీ నటిని సోషల్ మీడియా వేదికగా లైంగికంగా వేధించిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. అంతర్జాతీయ టెక్నాలజీ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలో డెలివరీ మేనేజర్‌గా పనిచేస్తున్న నిందితుడిని అదుపులోకి తీసుకుని జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు.తెలుగు, కన్నడ టీవీ సీరియళ్లలో నటించే 41 ఏళ్ల నటికి మూడు నెలల క్రితం 'నవీన్జ్' అనే ఫేస్‌బుక్ ఖాతా నుంచి ఫ్రెండ్ రిక్వెస్ట్ వచ్చింది. ఆమె దాన్ని అంగీకరించకపోయినా, మెసెంజర్ ద్వారా నిందితుడు రోజూ అసభ్యకరమైన సందేశాలు పంపడం ప్రారంభించాడు. నటి అతడిని బ్లాక్ చేయడంతో, అనేక కొత్త ఖాతాలు సృష్టించి వేధింపులను కొనసాగించాడు. అసభ్య సందేశాలతో పాటు తన మర్మాంగాల వీడియోలను కూడా పంపినట్లు బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.నవంబర్ 1న నిందితుడు మళ్లీ మెసేజ్ చేయడంతో నటి అతడిని నేరుగా కలవాలని కోరారు. అతడిని కలిసి వేధింపులు ఆపాలని హెచ్చరించినా వినలేదు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించి లైంగిక వేధింపులు, ఆన్‌లైన్ దుర్భాషల కింద కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడిని నవీన్ కె మోన్‌గా గుర్తించి అరెస్ట్ చేశారు. లండన్, పారిస్, న్యూయార్క్ వంటి నగరాల్లో కార్యాలయాలు ఉన్న ఓ గ్లోబల్ సంస్థలో అతను పనిచేస్తున్నట్లు తేలింది.

**నగరంలో మరో ఘటన**

ఇదిలా ఉండగా బెంగళూరు నగరంలో మరో మహిళకు కూడా ఇలాంటి అనుభవమే ఎదురైంది. శనివారం ఉదయం తన పెంపుడు కుక్కతో కలిసి వాకింగ్‌కు వెళ్లిన 33 ఏళ్ల మహిళను ఓ వ్యక్తి లైంగికంగా వేధించాడు. వెనుక నుంచి వచ్చి 'మేడమ్' అని పిలిచి, ఆమె వెనక్కి తిరగగానే దుస్తులు విప్పి అసభ్యంగా ప్రవర్తించాడని బాధితురాలు ఫిర్యాదులో తెలిపింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, నిందితుడిని గుర్తించి పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

## చీ..ఉలవలు తింటారా అనుకోవద్దు..
# రేసు గుర్రంలా ఉరికే ఆరోగ్యం కోసం..



జ్వరం, ఆయాసం, దగ్గు వంటి సమస్యలతో బాధపడేవారు ఉలవల కషాయం తాగడం ఎంతో మేలు. ఈ కషాయం జ్వరం, దగ్గు వంటి సమస్యల నుంచి తక్షణ ఉపశమనం అందిస్తుంది. అంతేకాదు.. తరచూ ఎక్కిళ్లు వచ్చేవారికి ఉలవలు మంచి మందులా పనిచేస్తుంది. తరచూ ఉలవలు తీసుకోవడం వల్ల ఎక్కిళ్ల సమస్య నుంచి తక్షణ ఉపశమనం పొందుతారు. ఉలవలు..మంచి బలవర్ధకమైన ఆహారం. మన శరీరానికి శక్తిని అందించడంతో పాటు అనేక అనారోగ్య సమస్యలను దూరం చేస్తాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఉలవల్లో ఫైబర్ పుష్కలగా ఉంటుంది. ప్రొటీన్, ఐరన్, కాల్షియం, ఫాస్ఫరస్, పీచుపదార్థం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఊబకాయం సమస్య ఉన్నవారు ఉలవలను తినటం మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఉలవల్లోని ఫైబర్ శరీరంలో చెడు కొలెస్ట్రాల్ కరిగించడంలో దోహదపడుతుంది. తద్వారా బరువు అదుపులో ఉంచుతుంది. మూత్ర సంబంధిత సమస్యలు నివారించడంలో ఉలవలు సహాయపడతాయి. దీనికోసం ఓ కప్పు ఉలవ చారుకు సమానంగా కొబ్బరి నీళ్లు తీసుకుంటే మూత్రంలో మంట తగ్గుతుంది. తరచూ మూత్రంలో మంటతో బాధపడేవారు ఈ చిట్కా పాటించండి. జ్వరం, ఆయాసం, దగ్గు వంటి సమస్యలతో బాధపడేవారు ఉలవల కషాయం తాగడం ఎంతో మేలు. ఈ కషాయం జ్వరం, దగ్గు వంటి సమస్యల నుంచి తక్షణ ఉపశమనం అందిస్తుంది. అంతేకాదు.. తరచూ ఎక్కిళ్లు వచ్చేవారికి ఉలవలు మంచి మందులా పనిచేస్తుంది. తరచూ ఉలవలు తీసుకోవడం వల్ల ఎక్కిళ్ల సమస్య నుంచి తక్షణ ఉపశమనం పొందుతారు. కిడ్నీ సమస్యల నుంచి ఉపశమనం కల్పించడంలో ఉలవలు దోహదపడతాయి. వీటిలోని పోషకాలు కిడ్నీలో రాళ్లు ఏర్పడకుండా రక్షిస్తాయి. అంతేకాదు హృదయ సంబంధ సమస్యలు రాకుండా ఉలవలు రక్షిస్తాయి. పిల్లల ఎదుగుదలకు ఉలవలు ఎంతో మేలు చేస్తాయి. ఇవి పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యానికి సహాయపడతాయి. వారికి బలాన్ని ఇస్తాయి. అనారోగ్య సమస్యలు రాకుండా కాపాడతాయి. చర్మ సమస్యల నివారణలో, కీళ్ళ నొప్పుల నివారణలో బాగా పని చేస్తాయి.

## చియా సీడ్స్, నల్ల ఎండు ద్రాక్ష కలిపి
# నానపెట్టి తీసుకుంటే ఇన్ని లాభాలా..?



చియా విత్తనాలు ఎక్కువసేపు కడుపు నిండుగా ఉంచుతాయి. ఎండుద్రాక్ష స్వీట్ తినాలన్న కోరికను తగ్గిస్తుంది. వాటి నీరు కొవ్వును వేగంగా కరిగిస్తుంది. బరువు తగ్గడానికి సహాయ పడుతుంది. నల్ల ఎండుద్రాక్ష, చియా విత్తనాలు రెండూ యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. ఇవి నానబెట్టిన నీటిని ప్రతిరోజూ ఉదయం తాగడం వల్ల చర్మం ఆరోగ్యంగా, ప్రకాశవంతంగా మారుతుంది. నల్ల ఎండుద్రాక్ష, చియా విత్తనాల నీరు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఈ రెండింటినీ కలిపి తాగడం వల్ల శరీరానికి లోపలి నుంచి పోషణ, శక్తి లభిస్తాయి. నల్ల ఎండుద్రాక్షలో ఐరన్, చియా విత్తనాలలో ఫైబర్, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. వీటి నీటిని తాగడం వల్ల శరీరంలో హిమోగ్లోబిన్ పెరిగి రక్తహీనత సమస్య తొలగిపోతుంది. చియా విత్తనాలలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఎండుద్రాక్ష కూడా జీర్ణక్రియకు సహాయపడుతుంది. ఇవి నానబెట్టిన నీరు మలబద్ధకం, గ్యాస్, అజీర్తి వంటి సమస్యలను తొలగిస్తుంది. నల్ల ఎండుద్రాక్షలో విటమిన్ సి, చియా విత్తనాలలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. వీటి నీరు రోగ నరోధక శక్తిని పెంచుతుంది. జలుబు, ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశాలు తగ్గుతాయి. ఎండుద్రాక్ష, చియా విత్తనాలలో ఒమేగా -3 కొవ్వు ఆమ్లాలు, పొటాషియం ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ ను నియంత్రిస్తాయి. వాటి నీరు గుండెపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఈ రెండింటిలో కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజాలు ఉన్నాయి. ప్రతిరోజూ వాటి నీటిని తాగడం వల్ల ఎముకలు బలోపేతం అవుతాయి. నల్ల ఎండుద్రాక్ష, చియా విత్తనాలు రెండూ సహజ చక్కెర, ప్రొటీన్ కలిగి ఉంటాయి. ఇవి శరీరానికి తక్షణ శక్తిని ఇస్తాయి. ఉదయాన్నే వీటి నీటిని తాగడం వల్ల రోజంతా చురుగ్గా ఉండవచ్చు. చియా విత్తనాలు ఎక్కువసేపు కడుపు నిండుగా ఉంచుతాయి. ఎండుద్రాక్ష స్వీట్ తినాలన్న కోరికను తగ్గిస్తుంది. వాటి నీరు కొవ్వును వేగంగా కరిగిస్తుంది. బరువు తగ్గడానికి సహాయ పడుతుంది. నల్ల ఎండుద్రాక్ష, చియా విత్తనాలు రెండూ యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. ఇవి నానబెట్టిన నీటిని ప్రతిరోజూ ఉదయం తాగడం వల్ల చర్మం ఆరోగ్యంగా, ప్రకాశవంతంగా మారుతుంది.

## పొరపాటున కూడా ఉదయం ఖాళీ
# కడుపుతో ఇవి అస్సలు తినకండి.. పెద్ద ప్రమాదమే!



ఉదయం అల్పాహారంలో తినడం వల్ల కడుపులో అసౌకర్యం, శక్తి లేకపోవడం లేదా పోషకాలను సరిగా గ్రహించకపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. రోజు మీ అల్పాహారం సమతుల్యంగా ఉండటం ముఖ్యం. ఇందులో ప్రొటీన్, ఆరోగ్యకరమైన కొవ్వు, సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు ఉంటాయి.. కొన్ని ఆహారాలు ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా భావిస్తారు. కానీ ఉదయం అల్పాహారంలో వాటిని తినడం ఆరోగ్యానికి మంచిది కాదంటున్నారు వైద్య నిపుణులు. కొన్ని ఆహారాలను ఖాళీ కడుపుతో తినడం వల్ల మీ శరీరంపై ప్రతిచర్యలు కలుగుతాయి. ఈ ఆహారాలలో పోషకాలు పుష్కలంగా ఉన్నప్పటికీ, ఆమ్లత్వం, ఫైబర్, చక్కెర అధికంగా ఉండే ఈ పదార్థాలను ఉదయం అల్పాహారంలో తినడం వల్ల కడుపులో అసౌకర్యం, శక్తి లేకపోవడం లేదా పోషకాలను సరిగా గ్రహించకపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. రోజు మీ అల్పాహారం సమతుల్యంగా ఉండటం ముఖ్యం. ఇందులో ప్రొటీన్, ఆరోగ్యకరమైన కొవ్వు, సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు ఉంటాయి. ఉదయాన్నే మీరు ఏమి తినకూడదో తెలుసుకుందాం. సిట్రస్ పండ్లు: సిట్రస్ పండ్లలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. కానీ వాటి అధిక ఆమ్లత్వం ఖాళీ కడుపుతో తింటే కడుపు పొరను చికాకుపెడుతుంది. ఇది ముఖ్యంగా యాసిడ్ రిఫ్లక్స్ ఉన్నవారిలో అసౌకర్యాన్ని కలిగిస్తుంది.

**పచ్చి కూరగాయలు:** పచ్చి కూరగాయలలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. కానీ వాటిలో కరగని ఫైబర్ కూడా ఎక్కువగా ఉంటుంది. వీటిని ఖాళీ కడుపుతో తింటే హానికరం కావచ్చు. ఉదయం వాటిని తినడం వల్ల ఉబ్బరం, గ్యాస్ లేదా కడుపు తిమ్మిర్లు వస్తాయి.

**గ్రానోలా:** ప్రజలు తరచుగా వాటిని ప్రయోజనకరంగా భావిస్తారు, కానీ గ్రానోలాలో అధిక మొత్తంలో చక్కెర మరియు శుద్ధి చేసిన నూనె ఉంటాయి. ఉదయం ఖాళీ కడుపుతో చక్కెరతో కూడిన వస్తువులను తినడం వల్ల శక్తి తగ్గుతుంది.

**గ్రీన్ స్మూతీ:** కాలే, పాలకూర వంటి ఆకు కూరలు ఆరోగ్యకరమైనవి. కానీ మీరు వాటిని పచ్చిగా తింటే వాటిలో అధిక మొత్తంలో ఆక్సలేట్, ఫైబర్ ఉంటాయి. ఖాళీ కడుపుతో వీటిని తీసుకోవడం వల్ల కాల్షియం లోపం నిరోధించవచ్చు. దీనివల్ల మీరు ఉబ్బరం లేదా గ్యాస్ వంటి సమస్యలను ఎదుర్కొంటారు. ఎల్లప్పుడూ ఉడికించిన వాటిని తినండి.

**టమోటాలు:** యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. టమోటాలు చాలా పుల్లగా ఉంటాయి. అల్పాహారంగా వీటిని తినడం వల్ల కడుపు పొర చికాకు కలిగిస్తుంది. కాలక్రమేణా గ్యాస్ట్రిటిస్ లేదా యాసిడ్ రిఫ్లక్స్ సమస్యను పెంచుతుంది.

**అరటిపండ్లలో.. :** పొటాషియం పుష్కలంగా ఉంటుంది. కానీ చక్కెర అధికంగా ఉంటుంది. ఖాళీ కడుపుతో తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి పెరుగుతుంది. రక్తంలో మెగ్నీషియం అకస్మాత్తుగా పెరుగుతుంది. ఇది గుండె ఆరోగ్యాన్ని పాడు చేస్తుంది.

# సంతానం లేమి సమస్యకు చెక్ పెట్టే దివ్య ఔషధం..! పతంజలి ఔషధ ప్రయోజనాలు




నేటి తరంలో పెరుగుతున్న వంధ్యత్వ సమస్యకు పతంజలి ఆయుర్వేదం సహజమైన పరిష్కారాలను అందిస్తోంది. అశ్వగంధ, శతావరి వంటి ఔషధాలు, దివ్య పుష్పాంజలి క్వాత్, దివ్య చంద్రప్రభ వతి వంటి మందులు పురుషులు, స్త్రీలలో సంతానోత్పత్తిని పెంచుతాయి. యోగా, ప్రాణాయామం, ఆరోగ్యకరమైన జీవనశైలి వంధ్యత్వ నివారణలో కీలకపాత్ర పోషిస్తాయి. నేటి కాలంలో వేగంగా మారుతున్న జీవనశైలి, ఒత్తిడి, క్రమరహిత ఆహారపు అలవాట్లు, శరీరంలో హార్మోన్ల మార్పుల కారణంగా చాలా మంది దంపతులు ఇన్‌ఫర్టిలిటీ సమస్యను ఎదుర్కొంటున్నారు. దీని చికిత్స వైద్య శాస్త్రంలో అందుబాటులో ఉంది. పతంజలి ఆయుర్వేదం ఈ దిశలో అనేక ప్రభావవంతమైన మందులు, నివారణలను కూడా సూచించింది, ఇది ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా ఈ సమస్యను మూలం నుండి నిర్మూలించడంలో సహాయపడుతుంది. పతంజలి పరిశోధనా సంస్థ హరిద్వార్ వంధ్యత్వ చికిత్సపై కూడా పరిశోధన చేసింది. దీనిలో కొన్ని మందులు ప్రయోజనకరంగా ఉన్నాయని వివరించబడింది. మందుల గురించి తెలుసుకునే ముందు ఇన్‌ఫర్టిలిటీకి కారణం ఏమిటో తెలుసుకుందాం.. దీని వెనుక చాలా కారణాలు ఉండవచ్చు. హార్మోన్ల అసమతుల్యత ఒక ప్రధాన సమస్య. స్త్రీలలో క్రమరహిత పీరియడ్స్ లేదా వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. దీని కారణంగా ఇన్‌ఫర్టిలిటీ సమస్య పెరుగుతుంది. పురుషులు, స్త్రీలలో శుక్రకణాల సంఖ్య తగ్గడం ప్రారంభమవుతుంది. అధిక ఒత్తిడి, నిరాశ కూడా దీనికి కారణం కావచ్చు. ఊబకాయం లేదా చాలా తక్కువ బరువు ఉండటం కూడా దీనికి కారణం కావచ్చు. థైరాయిడ్ లేదా డయాబెటిస్ వంటి వ్యాధులు, ధూమపానం వంటి వ్యసనం, మద్యం సేవించడం, వయస్సు పెరగడం కూడా దీనికి కారణం కావచ్చు.

**పతంజలి ఔషధాల ప్రయోజనాలు :** పతంజలి పరిశోధనలో అశ్వగంధ పొడి వంధ్యత్వానికి చికిత్స చేయడంలో ప్రయోజనకరంగా ఉంటుందని తేలింది. అశ్వగంధ పురుషులలో శుక్రకణాల నాణ్యత, సంఖ్యను పెంచడంలో సహాయపడుతుంది. ఇది మహిళలకు అండోత్సర్గమును కూడా నియంత్రిస్తుంది.

**శతావరి పొడి :** ఆస్పరాగస్ మహిళలకు ఒక వరంలా పరిగణించబడుతుంది. ఇది గర్భధారణ అవకాశాలను పెంచుతుంది, గర్భాశయాన్ని బలపరుస్తుంది. ఇది హార్మోన్ల అసమతుల్యతను కూడా నియంత్రిస్తుంది.



**దివ్య పుష్పాంజలి క్వాత్ :** ఈ ప్రత్యేక రకం కషాయం మహిళల్లో సంతానోత్పత్తిని పెంచడంలో, రుతుక్రమ సమస్యలను నయం చేయడంలో సహాయపడుతుంది.

**దివ్య చంద్రప్రభ వతి :** ఈ ఔషధం పురుషులు, మహిళలు ఇద్దరికీ ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది శరీరం నుండి విషపూరిత అంశాలను తొలగించడం ద్వారా శారీరక బలహీనతను తొలగిస్తుంది.

**దివ్య యౌవ్నామృత వతి :** ఇది ముఖ్యంగా శుక్రకణం లేకపోవడం, బలహీనత వంటి పురుషుల వంధ్యత్వానికి సంబంధించిన సమస్యలను తొలగిస్తుంది.

**పతంజలి ప్రత్యేక చిట్కాలు :** పతంజలి కేవలం మందులపైనే కాకుండా జీవనశైలి మార్పులపై కూడా దృష్టి పెడుతుంది. వంధ్యత్వాన్ని అధిగమించడానికి క్రమం తప్పకుండా యోగా, ప్రాణాయామం చాలా ముఖ్యమైనవని స్వామి రామ్‌దేవ్ స్వయంగా చెప్పారు. ముఖ్యంగా కపాల్‌భతి, అనులోమ-విలోమ, భస్త్రిక వంటి ప్రాణాయామాలు సంతానోత్పత్తిని పెంచడంలో సహాయపడతాయి. దీనితో పాటు ఆకుపచ్చ కూరగాయలు, కాలానుగుణ పండ్లు, డ్రై ఫ్రూట్స్, నెయ్యి, పాలు తీసుకోవాలి. వేయించిన ఆహారాలు, జంక్ ఫుడ్, ఎక్కువ కారంగా ఉండే ఆహారానికి దూరంగా ఉంటే మంచిది. ఎక్కువ నీరు తాగాలి :

# మీ బడ్జెట్?లో యూరప్ ట్రిప్.. టాప్ 5 చౌక యూరప్ దేశాలు ఇవే..




యూరప్‌కు వెళ్లడం ఎల్లప్పుడూ ఖరీదైనదిగా ఉండనవసరం లేదు. చాలా మంది యూరప్ అంటే పారిస్, లండన్ లేదా రోమ్ వంటి పెద్ద నగరాలు అని అనుకుంటారు. ఇది చాలా ఖరీదైనది కావచ్చు. కానీ నిజం ఏమిటంటే యూరప్‌లో చాలా అందమైన, సరసమైన దేశాలు ఉన్నాయి. ఇక్కడ మీరు ఎక్కువ డబ్బు ఖర్చు చేయకుండా గొప్ప సమయాన్ని గడపవచ్చు. యూరప్‌లోని 5 చౌక దేశాలు ఏంటి.? ఈరోజు తెలుసుకుందాం..

**బల్గేరియా:** యూరప్‌లో సందర్శించడానికి అత్యంత చౌకైన ప్రదేశాలలో బల్గేరియా ఒకటి. రంగులు, చరిత్రతో నిండిన ప్లోవ్‌డివ్ పాత పట్టణం గుండా మీరు నడవవచ్చు. ఎండ ఎక్కువగా ఉండే, రద్దీగా లేని నల్ల సముద్రం వెంబడి ఉన్న బీచ్‌లను కూడా మీరు ఆస్వాదించవచ్చు. మీరు ప్రకృతిని ఇష్టపడితే, హైకింగ్ లేదా స్కీయింగ్ కోసం పర్వతాలను వీక్షించవచ్చు. ఇక్కడ ఆహారం చౌకగా, రుచికరంగా ఉంటుంది. పబ్లిక్ బస్సులు, రైళ్లు ఉపయోగించడానికి సులభమైనవి, చాలా సరసమైనవి. డబ్బు ఆదా చేయాలనుకునే ప్రయాణికులకు ఈ దేశం నిజంగా మంచిది.

**రొమేనియా:** రొమేనియా ఒక అద్భుత కథలోని ప్రదేశంలా అనిపిస్తుంది. మీరు డ్రాక్యులా కోట అని పిలువబడే ప్రసిద్ధ బ్రాన్ కోట వంటి కోటలను సందర్శించవచ్చు. ఈ దేశం పచ్చని కొండలు, ప్రశాంతమైన గ్రామాలు, పాత సంప్రదాయాలతో నిండి ఉంది. ట్రాన్సిల్వేనియా అన్వేషించడానికి గొప్ప ప్రాంతం, మీరు హైకింగ్ లేదా ప్రకృతి పర్యటనలను ఇష్టపడితే కార్పాతియన్ పర్వతాలు ఉన్నాయి. రాజధాని బుకారెస్ట్‌లో చాలా పార్కులు, మ్యూజియంలు, చూడటానికి సరదా ప్రదేశాలు ఉన్నాయి. ఉత్తమ భాగం ఏమిటంటే ప్రతిదీ చాలా ఇతర యూరోపియన్ దేశాల కంటే చాలా చౌకగా ఉంటుంది.

**అల్బేనియా:** అల్బేనియా అంతగా ప్రసిద్ధి చెందలేదు. కానీ ఇది యూరప్‌లోని ఉత్తమ బడ్జెట్ గమ్యస్థానాలలో ఒకటి. ఇది గ్రీస్‌లో ఉన్న బీచ్‌ల మాదిరిగానే కనిపించే శుభ్రమైన నీలిరంగు బీచ్‌లను కలిగి ఉంది. ప్రజలు దయగలవారు. ఆహారం తాజాగా మరియు రుచితో నిండి ఉంటుంది. రాతి ఇళ్ళు, అద్భుతమైన దృశ్యాలను కలిగి ఉన్న బెరాట్, జిరోకాస్టర్ వంటి పాత పట్టణాలను మీరు సందర్శించవచ్చు. ఎక్కువ మంది పర్యాటకులు ఉండరు కాబట్టి ఇది మరింత ప్రశాంతంగా, ప్రత్యేకంగా అనిపిస్తుంది. బీచ్ సంస్కృతి, పొదుపు కోరుకునే వ్యక్తులకు అల్బేనియా సరైనది.

**పోలాండ్:** పోలాండ్ చరిత్ర, ఆకర్షణలతో నిండి ఉంది. క్రాకో, వార్సా వంటి నగరాల్లో అందమైన వీధులు, పాత భవనాలు, ఆనందించడానికి చాలా సంస్కృతి ఉన్నాయి. క్రాకో చౌకగా, శక్తితో నిండినందున విద్యార్థులు, బ్యాక్‌ప్యాకర్లకు చాలా నచ్చుతుంది. మీరు రుచికరమైన పోలిష్ ఆహారాన్ని ప్రయత్నించవచ్చు. మ్యూజియంలను సందర్శించండి. ఎక్కువ డబ్బు ఖర్చు చేయకుండా నడక పర్యటనలకు వెళ్లండి. మీరు ప్రకృతిని ఇష్టపడితే పోలాండ్‌లో అందమైన గ్రామీణ సరస్సులు, అడవులు కూడా ఉన్నాయి. మీరు బడ్జెట్‌లో ప్రయాణిస్తుంటే యూరప్‌లో వెళ్ళడానికి ఇది ఉత్తమమైన ప్రదేశాలలో ఒకటి.

**హంగేరీ:** బడ్జెట్ ప్రయాణికులకు హంగేరీ మరో అగ్ర ఎంపిక. రాజధాని నగరం బుడాపెస్ట్ వెచ్చని స్నానపు గదులు, వంతెనలు, అద్భుతమైన భవనాలకు ప్రసిద్ధి చెందింది. ఇది గతం నుంచి వచ్చిన నగరంలా కనిపిస్తుంది. కానీ ఇప్పటికీ జీవితం, వినోదంతో నిండి ఉంది. మీరు చౌకైన ఆహారం, చౌకైన బస స్థలాలను కనుగొనవచ్చు. ఇది సుదీర్ఘ పర్యటనలకు గొప్పగా చేస్తుంది. దేశంలోని ఇతర ప్రాంతాలలో కోటలు, చిన్న పట్టణాలు, సరస్సులు కూడా ఉన్నాయి. హంగేరీ అందం, చరిత్ర కలిగి ఉంది.

# అరటి పండు తిన్న తర్వాత ఈ పదార్థాలు తింటున్నారా..? మీ లైఫ్ డెంజర్‌లో పడినట్టే..





అరటి పండులో లెక్కలేనన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. దీనిని పోషకాల పవర్ హౌస్ అంటారు. ఈ పండులో అనేక రకాల పోషకాలు ఉంటాయి. దీన్ని తినడం వల్ల శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. అరటి పండులో మెగ్నీషియం, పొటాషియం, పీచు మొదలైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అరటి పండుతో అనేక ప్రయోజనాలున్నప్పటికీ.. కొన్ని ఫుడ్స్‌తో కలిపి తినకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాంటి ఆహారాలేంటో ఇక్కడ తెలుసుకుందాం.. అరటిపండు తిన్న తర్వాత పుల్లని పండ్లు తినకూడదు. అరటిపండు తిన్న తర్వాత పుల్లని పండ్లు తినడం వల్ల అజీర్ణం చేస్తుంది. దీంతో జీర్ణ సమస్యలు తలెత్తుతాయి. అలాగే, అరటిపండ్లు, పాలు ఎప్పుడూ కలిపి తినకూడదని నిపుణులు చెబుతున్నారు. ఈ కలయిక మీ ఆరోగ్యానికి హానికరం. అరటిపండ్లు తిన్న తర్వాత వీటిని తీసుకోవడం వల్ల పొట్ట సమస్యలు కలిగిస్తాయి. అరటిపండు తిన్న తర్వాత పుల్లని పండ్లు తినకూడదు. అరటిపండు తిన్న తర్వాత పుల్లని పండ్లు తినడం వల్ల అజీర్ణం చేస్తుంది. దీంతో జీర్ణ సమస్యలు తలెత్తుతాయి. అలాగే, అరటిపండ్లు, పాలు ఎప్పుడూ కలిపి తినకూడదని నిపుణులు చెబుతున్నారు. ఈ కలయిక మీ ఆరోగ్యానికి హానికరం. అరటిపండ్లు తిన్న తర్వాత వీటిని తీసుకోవడం వల్ల పొట్ట సమస్యలు కలిగిస్తాయి.

అరటిపండ్లు తిన్న తర్వాత తీపి పదార్థాలు కూడా తినకూడదని నిపుణులు చెబుతున్నారు. అరటిపండ్లు తిన్న తర్వాత వాటిని తీసుకోవడం వల్ల శరీరంలో రక్తంలో చక్కెర స్థాయి పెరుగుతుంది. మధుమేహం లేకపోయినా అరటి పండు తర్వాత స్వీట్స్ తినకూడదని చెబుతున్నారు.

అంతేకాదు.. రాత్రిపూట కూడా అరటి పండును అస్సలు తినకూడదని నిపుణులు చెబుతుంటారు. బనానా తిన్న తర్వాత వేయించిన పదార్థాలు తినకూడదు. కారంతో చేసిన పదార్థాలకు వీలైనంత దూరంగా ఉండాలి. కాఫీలు, టీలు బనానా తిన్నాక తాగడం మానేయాలి. దీని వల్ల జీర్ణసమస్యలు , అలెర్జీలు, ముఖంపై మచ్చలు వస్తాయి.

అలాగే అరటిపండు తిన్న తర్వాత కాఫీ తాగకూడదు. ఈ సమయంలో కాఫీ తాగడం వల్ల మలబద్ధకం ఏర్పడుతుంది. అరటిపండు తిన్న వెంటనే చల్లటి నీరు తాగకూడదు. దీనివల్ల జీర్ణ ప్రక్రియలో ఆటంకాలు ఏర్పడతాయి. రాత్రిపూట సాధ్యమైనంతవరకు అరటి పండును తినకపోవడమే మేలు.

బంగాళదుంప, అరటి పండును కలిపి తినకూడదని నిపుణులు చెబుతున్నారు. బంగాళదుంపలో పిండిపదార్థం ఎక్కువగా ఉంటుంది. రెండింటినీ కలిపి తినడం వల్ల జీర్ణ సమస్యలు, గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యలు ఏర్పడవచ్చు. అందుకే ఈ రెండిండి కాంబినేషన్‌కు దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

# అలసత్వం వద్దు.. నిద్ర తగ్గితే వచ్చే 5 ప్రమాదకర సమస్యలు ఇవే



నిద్ర అనేది మనిషి ఆరోగ్యం, శ్రేయస్సులో అత్యంత ముఖ్యమైన భాగం. అవసరమైన గంటలు నిద్ర లేకపోవడం, మంచి నాణ్యత గల నిద్ర దొరకకపోవడం వల్ల ఆరోగ్యంపై అనేక విధాలుగా ప్రభావం పడుతుంది. ప్రతిరోజూ కనీసం 7-8 గంటలు నిద్రపోవడం చాలా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. అయితే, చాలామంది తమ నిద్ర సమయాన్ని ఇతర పనుల కోసం కేటాయించి విశ్రాంతి తీసుకోవడం లేదు ఇలా చేయడం వల్ల కేవలం నిద్ర ఆరోగ్యంపైనే కాదు, మొత్తం శరీరం, శ్రేయస్సుపైనా ప్రతికూల ప్రభావం పడుతుంది. బరువు పెరగడం నుంచి క్యాన్సర్, మధుమేహం, డిప్రెషన్ వంటి తీవ్రమైన వ్యాధుల ముప్పు పెరగడం వరకు, ఈ జాబితా అంతులేనిది. అందుకే, చక్కగా నిద్రపోవడం అత్యవసరం. మీరు నిద్ర గంటలను తగ్గించుకుంటే మీ శరీరానికి ఏమి జరుగుతుందో తెలుసుకోండి..

**1. బరువు పెరుగుట:** మీరు నిద్ర లేకపోతే, అది ఆకలిని నియంత్రించే హార్మోన్లైన 'ఘ్రెలిన్', 'ల్యాప్టిన్' సమతుల్యతను ప్రభావితం చేస్తుంది. దీనివల్ల మీకు అధిక కేలరీలు, చక్కెర పదార్థాలపై కోరిక పెరిగి, ఎక్కువగా తినేలా చేస్తుంది. ఇది తక్కువ శక్తి, తక్కువ శారీరక శ్రమతో కలిసి బరువు పెరగడానికి దారితీస్తుంది.

**2. టైప్ 2 మధుమేహం ప్రమాదం:** మీరు నిద్రలేమితో బాధపడుతున్నప్పుడు, ఇన్సులిన్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకునే మీ శరీర సామర్థ్యం దెబ్బతింటుంది. దీనివల్ల 'ఇన్సులిన్ రెసిస్టెన్స్' ఏర్పడుతుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుంది, కాలక్రమేణా టైప్ 2 మధుమేహానికి దారితీస్తుంది.

**3. గుండె జబ్బుల ప్రమాదం:** నిద్రలేమి గుండె ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. ఇది అధిక రక్తపోటుకు దారితీస్తుంది, 'కార్టిసాల్' వంటి ఒత్తిడి హార్మోన్లను పెంచుతుంది మరియు మంటను కలిగిస్తుంది. ఈ కారకాలన్నీ కలిసి గుండె జబ్బులు, స్ట్రోక్ మరియు ఇతర గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతాయి.


**4. బలహీనమైన రోగనిరోధక వ్యవస్థ**: నిద్రలో మీ శరీరం 'సైటోకైన్‌లను' విడుదల చేస్తుంది, ఇవి అంటువ్యాధులు మరియు మంటలతో పోరాడటానికి సహాయపడతాయి. అయితే, మీకు అవసరమైన నిద్ర లేకపోతే, సైటోకైన్ ఉత్పత్తి తగ్గుతుంది. ఇది రోగనిరోధక వ్యవస్థను బలహీనపరుస్తుంది. **5. క్యాన్సర్ ప్రమాదం:** తక్కువ నిద్ర దెబ్బతినడాన్ని సరిచేసే మరియు కణాల పెరుగుదలను నియంత్రించే శరీర సామర్థ్యాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. దీనితో పాటు, ఇది 'మెలటోనిన్' ఉత్పత్తిని కూడా ప్రభావితం చేస్తుంది, ఇది రొమ్ము, ప్రోస్టేట్ మరియు కొలొరెక్టల్ క్యాన్సర్ వంటి కొన్ని క్యాన్సర్‌ల అభివృద్ధికి దారితీస్తుంది

# సెల్ఫ్ మేడ్ బిలియనీర్ల్లు'గా భారత సంతతి టెకీలు- 22ఏళ్ల వయసులోనే వందల కోట్ల ఆస్తి- మార్క్ జుకర్‌బర్గ్ రికార్డ్ బ్రేక్




సెల్ఫ్ మేడ్ బిలియనీర్లుగా ఆదర్శ్ హిరేమత్, సూర్య మిధా- భారత సంతతి టెకీల కొత్త రికార్డు భారత సంతతి టెకీలు మరోసారి అగ్రరాజ్యం అమెరికాలో సత్తా చాటారు. తామేంటో నిరూపించారు. యువతేజాలు ఆదర్శ్ హిరేమత్, సూర్య మిధా 22 ఏళ్ల వయసులోనే 'సెల్ఫ్ మేడ్ బిలియనీర్లు' అయ్యారు. బ్రెండన్ ఫుడీ అనే తమ క్లాస్‌మేట్‌తో కలిసి వారు స్థాపించిన ఏఐ రిక్రూటింగ్ స్టార్టప్ 'మెర్కోర్' అనూహ్య విజయాన్ని సాధించడంతో ఇది సాధ్యమైంది. చిన్న వయసులో 'సెల్ఫ్ మేడ్ బిలియనీర్' అయిన రికార్డు ఇప్పటిదాకా ఫేస్‌బుక్ (మెటా) అధినేత మార్క్ జుకర్‌బర్గ్ పేరిట ఉండేది. ఆయన 2008లో 23 ఏళ్ల వయసులో బిలియనీర్ అయ్యారు. మన ఆదర్శ్ హిరేమత్, సూర్య మిధాలు ఇంతకంటే తక్కువ వయసులోనే బిలియనీర్లుగా ఎదిగి, జుకర్‌బర్గ్ రికార్డును తిరగ రాశారు.మెర్కోర్‌కు రూ.3,100 కోట్ల నిధులుమెర్కోర్ కంపెనీ అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కో నగరం కేంద్రంగా పనిచేస్తోంది. ఇటీవలే ఇది రూ.3,100 కోట్ల నిధులను సమీకరించింది. ప్రస్తుతం ఈ కంపెనీ మార్కెట్ విలువ దాదాపు రూ.88వేల కోట్లుగా ఉంది. మెర్కోర్‌కు సీఈఓగా బ్రెండన్ ఫుడీ, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ (సీటీఓ)గా ఆదర్శ్ హిరేమత్, కంపెనీ బోర్డు ఛైర్మన్‌గా సూర్య మిధాలు కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కంపెనీ ఆర్థిక పురోగతి వల్ల ఈ ముగ్గురు చిన్న వయసులోనే సెల్ఫ్ మేడ్ బిలియనీర్లుగా ఎదిగారని ఫోర్బ్స్ తెలిపింది.

# తగ్గుతున్న లాభాలు.. పెరుగుతున్న పోటీ.. ఇకపై బ్యాంకులకు కష్టకాలమే!




దేశీయ బ్యాంకింగ్ రంగ లాభాలు ముమ్ముందూ ఆశాజనకంగా ఉండకపోవచ్చన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి. దేశీయ బ్యాంకింగ్ రంగ లాభాలు ముమ్ముందూ ఆశాజనకంగా ఉండకపోవచ్చన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ ఏడాది వరుస ద్రవ్యసమీక్షల్లో రెపోరేటును ఒక శాతం (100 బేసిస్ పాయింట్లు) తగ్గించిన నేపథ్యంలో ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులూ రుణాలపై వడ్డీరేట్లను తగ్గించేశాయి. మరోవైపు డిపాజిట్లపై మాత్రం వడ్డీరేట్లు ఆ స్థాయిలో తగ్గలేదు. నిరుడు డిసెంబర్ నుంచి రుణాలపై వడ్డీరేట్లు 50 బేసిస్ పాయింట్లు తగ్గితే.. డిపాజిట్లపై 30 బేసిస్ పాయింట్లే తగ్గాయి. బ్యాంకుల మధ్య నెలకొన్న తీవ్ర పోటీ ఇందుకు కారణమవగా.. లాభాలపై ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నదిప్పుడు. ఈ ఆర్థిక సంవత్సరం జూలై-సెప్టెంబర్‌కుగాను వివిధ బ్యాంకులు ప్రకటిస్తున్న ఆర్థిక ఫలితాలు ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. బ్యాంక్ ఆఫ్ బరోడా (8.2 శాతం), బంధన్ బ్యాంక్ (88 శాతం), యాక్సిస్ బ్యాంక్ (26 శాతం), కొటక్ మహీంద్రా బ్యాంక్ (2 శాతం) లాభాలు గతంతో పోల్చితే నిరాశపర్చాయి. ప్రస్తుతం మెజారిటీ బ్యాంకు లు రుణాలపై ఫ్లోటింగ్ వడ్డీరేట్లను అమలు చేస్తున్నాయి. దీంతో ఆర్బీఐ పాలసీ రేటు ఆధారంగా ఇవీ తగ్గిపోయాయి. ఫలితంగా బ్యాంకుల రాబడులూ పడిపోతున్నాయి.ఆర్బీఐ ఇంకా తగ్గిస్తే..ద్రవ్యోల్బణం అదుపులో ఉంటే.. వృద్ధిరేటుకు పెద్దపీట వేస్తామని ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా గత ద్రవ్యసమీక్షలో చెప్పారు. దీన్నిబట్టి వచ్చే ద్రవ్యసమీక్షల్లో రెపోరేటు ఇంకా తగ్గేందుకు వీలున్నది. పైగా అమెరికా టారిఫ్‌లు, రూపాయి విలువ పతనం వంటివి.. దేశ జీడీపీకి తప్పక మద్దతివ్వాల్సిన అవసరాన్ని సృష్టిస్తున్నాయి. ఈ క్రమంలో బ్యాంకుల లాభాలు మరింతగా దిగజారవచ్చన్న అంచనాలైతే గట్టిగా వినిపిస్తున్నాయి.

# టాటా ట్రస్ట్స్ నుంచి తొలగింపు.. న్యాయపోరాటానికి సిద్ధమైన మెహ్లీ మిస్త్రీ




టాటా గ్రూప్ దాతృత్వ సంస్థ టాటా ట్రస్ట్స్‌లో విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. దివంగత పారిశ్రామిక వేత్త రతన్ టాటా అత్యంత సన్నిహితుల్లో ఒకరైన మెహ్లీ మిస్త్రీకి టాటా ట్రస్ట్స్ నుంచి తొలగించిన విషయం తెలిసిందే. టాటా గ్రూప్ దాతృత్వ సంస్థ టాటా ట్రస్ట్స్‌లో విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. దివంగత పారిశ్రామిక వేత్త రతన్ టాటా అత్యంత సన్నిహితుల్లో ఒకరైన మెహ్లీ మిస్త్రీకి టాటా ట్రస్ట్స్ నుంచి తొలగించిన విషయం తెలిసిందే. టాటా గ్రూప్‌నకు చెందిన మూడు కీలక దాతృత్వ ట్రస్ట్‌లకు జీవితకాల ట్రస్టీగా మెహ్లీ మిస్త్రీని పునర్నియమించేందుకు చేసిన ప్రతిపాదనకు ఆమోదం లభించలేదు. టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నియోల్ టాటా, మరో ఇద్దరు ట్రస్టీలు.. మిస్త్రీ పునర్నియామకాన్ని గట్టిగా వ్యతిరేకించారు. దీంతో మిస్త్రీ న్యాయపోరాటానిక సిద్ధమయ్యారు. ముంబై ఛారిటీ కమిషనంఎవద్ద కేవియట్ దాఖలు చేసినట్లు తెలిసింది.రతన్ టాటా అత్యంత సన్నిహితుల్లో ఒకరైన మెహ్లీ మిస్త్రీ 2022లో టాటా ట్రస్ట్స్‌కు ట్రస్టీగా నియమితులయ్యారు. అయితే, ఆయన మూడేండ్ల పదవీకాలం అక్టోబరు 28తో ముగిసింది. దీంతో ట్రస్టీగా మెహ్లీ మిస్త్రీ మూడేండ్ల పదవీకాలం ముగుస్తుండటంతో ఆయన పునర్నియామకం చేపట్టారు. ఇందుకోసం అనుమతిని కోరుతూ ఇతర ట్రస్టీలకు టాటా ట్రస్ట్స్ సీఈఓ ఇటీవలే ఒక సర్క్యులర్ పంపారు. అయితే, ఈ ప్రతిపాదనను ట్రస్టీలు నోయల్ టాటా, టీవీఎస్ మోటర్ కంపెనీ ఛైర్మన్ ఎమిరేట్స్ వేణు శ్రీనివాసన్, రక్షణ శాఖ మాజీ కార్యదర్శి విజయ్ సింగ్ వ్యతిరేకించారు. ఇదే సమయంలో సిటిబ్యాంక్ ఇండియా మాజీ సీఈవో ప్రమిత్ ఝవేరి, ముంబైకి ాటా ట్రస్ట్స్‌లో విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. దివంగత పారిశ్రామిక వేత్త రతన్ టాటా అత్యంత సన్నిహితుల్లో ఒకరైన మెహ్లీ మిస్త్రీకి టాటా ట్రస్ట్స్ నుంచి తొలగించిన విషయం తెలిసిందే. టాటా గ్రూప్‌నకు చెందిన మూడు కీలక దాతృత్వ ట్రస్ట్‌లకు జీవితకాల ట్రస్టీగా మెహ్లీ మిస్త్రీని పునర్నియమించేందుకు చేసిన ప్రతిపాదనకు ఆమోదం లభించలేదు. టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నియోల్ టాటా, మరో ఇద్దరు ట్రస్టీలు.. మిస్త్రీ పునర్నియామకాన్ని గట్టిగా వ్యతిరేకించారు. దీంతో మిస్త్రీ న్యాయపోరాటానిక సిద్ధమయ్యారు. ముంబై ఛారిటీ కమిషనంఎవద్ద చెందిన న్యాయవాది డారియస్ ఖంబాట, పుణెకు చెందిన ఫిలంత్రోఫిస్ట్ జహంగీర్ హెచ్‌సీ జహంగీర్‌లు మిస్త్రీకి మద్దతు పలికారు. అయినప్పటికీ మిస్త్రీ పునర్నియామకానికి ఆమోదం లభించలేదు.

# ఫాస్టాగ్ యూజర్లకు బిగ్ అలర్ట్- ప్రాసెస్‌పై కొత్త రూల్స్




ఫాస్టాగ్ వినియోగదారులకు ఉపశమనం- కేవైవీ ప్రాసెస్ మరింత సులభతరంనేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఫాస్టాగ్ యూజర్లకు ఉపశమనం కలిగించే నిర్ణయం తీసుకుంది. నో యువర్ వెహికల్ ప్రక్రియను మరింత సులభతరం చేసింది. ఫాస్టాగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, వినియోగదారులకు నిరంతర, సులభమైన సేవలను అందించడమే లక్ష్యంగా ఎన్‌హెచ్‌ఏఐ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఇండియన్ హైవేస్ మేనేజ్ మెంట్ కంపెనీ లిమిటెడ్ మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ సర్క్యులర్‌లో ఏముందంటేఇక టోల్ ప్లాజా వద్ద ఆపాల్సిన పనిలేదుఇక నుంచి వాహనం విండ్ స్క్రీన్‌పై అమర్చిన డివైజ్ రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్‌సాంకేతికతను ఉపయోగించి ఆటోమేటిక్ టోల్ చెల్లింపును అనుమతిస్తుంది. దీంతో వాహనదారులు నగదు లావాదేవీల కోసం టోల్ ప్లాజా వద్ద ఆగాల్సిన అవసరం లేదు.ఫాస్టాగ్ సేవలకు కొంత సమయంకేవైవీ ప్రక్రియను పూర్తి చేయని వాహనాల ఫాస్టాగ్ సేవలుయాక్టివ్‌గాఉంటాయి. ఫాస్టాగ్‌సేవలనుతక్షణమేనిలిపివే యకుండాకేవైసీప్రక్రియను పూర్తి చేసేందుకు వినియోగదారులకు కొంత సమయం ఇస్తారు.ఫాస్టాగ్‌యూజర్లకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఈ మార్పు తీసుకొచ్చారు. ఈ నిర్ణయం కేవైవీ ప్రక్రియను పూర్తి చేయని ఫొటోలు అవసరం లేదుఅలాగే కేవైవీ ప్రక్రియను పూర్తి చేసేందుకు ఇక నుంచి కార్లు, జీపులు, వ్యాన్‌ల వంటి వాహనాల సైడ్ ఫొటోలు అవసరం లేదు. నంబర్ ప్లేట్, ఫాస్టాగ్ కనిపిస్తున్న వాహనం ముందు వైపు చిత్రాన్ని మాత్రమే అప్లోడ్ చేస్తే సరిపోతుంది.ఆటోమేటిక్ ఆర్సీనియోగదారులు వాహనం నంబర్, ఛాసిస్ నంబర్ లేదా మొబైల్ నంబర్‌ను ఎంటర్ చేసి 'వాహన్' పోర్టల్ నుంచి రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (ఆర్సీ) వివరాలను ఆటోమేటిక్‌గా పొందొచ్చు. అలాగే ఒకే మొబైల్ నంబర్‌పై ఒకటి కన్నా ఎక్కువ వాహనాలు రిజిస్టర్ అయి ఉంటే ఏ వాహనానికి కేవైవీ పూర్తి చేయాలో ఎంపిక చేసుకునే అవకాశాన్ని యూజర్లకు కల్పించారు.ఎస్ఎంఎస్ అలర్ట్సకేవైవీ విధానం అమల్లోకి రాకముందు జారీ చేసిన ఫాస్టాగ్స్ యథావిధిగా పనిచేస్తాయి. అయితే కేవైసీకి ముందు జారీ చేసిన ఫాస్టాగ్ దుర్వినియోగం లేదా వదులుగా ఉన్న ట్యాగ్?లకు సంబంధించిన ఫిర్యాదులు అందకపోతే అవి యాక్టివ్?గా ఉంటాయి. అలాగే కేవైవీని పూర్తి చేయని వినియోగదారులకు ఫాస్టాగ్ జారీ చేసే బ్యాంకుల నుంచి ఎస్ఎంఎస్ నోటిఫికేషన్లు వస్తాయి.ఫిర్యాదులకు హెల్ప్ లైన్ నంబర్‌దైనా కారణం వల్ల డాక్యుమెంట్స్ అప్లోడ్ చేయడంలో యూజర్లు సమస్యలు ఎదుర్కొంటే ఫాస్టాగ్ జారీచేసే బ్యాంక్ వెంటనే కస్టమర్‌ను సంప్రదించి, కెవైవీ ప్రొసీజర్ పూర్తి చేసేందుకు సాయపడాలి. కేవీవీ సంబంధిత ఫిర్యాదు కోసం నేషనల్ హైవే హెల్ప్ లైన్ నంబర్ 1033కి కాల్ చేయవచ్చు.హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వెబ్ సైట్ ప్రకారరో యువర్ వెహికల్ (కేవీవీ) అనేది ఫాస్టాగ్ యూజర్లు తమ ఫాస్టాగ్‌కు సంబంధించిన నిర్దేశిత ఫొటోలను అప్లోడ్ చేయాల్సిన రెగ్యులేటరీ అవసరం. సరైన వాహనానికి, సరైన నంబర్ వెహికల్‌కే ఫాస్టాగ్ జారీ చేశారని నిర్ధరించేందుకు ఈ కొత్త కేవైవీ ప్రాసెస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. వాహనం విండ్ షీల్డ్‌పై ఫాస్టాగ్ అంటించారా లేదా? అనేది సైతం దీని ద్వారా తెలుస్తుంది. ఒకసారి కేవైవీ పూర్తి చేస్తే మూడేళ్ల వరకు అది చెల్లుతుంది. అంటే దాని వ్యాలిడిటీ మూడు సంవత్సరాలు. 3 ఏళ్ల తర్వాత రీ-కేవైవీ పూర్తి చేసుకోవాలి.బ్యాంక్ ప్రకారంఎన్‌హెచ్‌ఏఐ నిబంధనల ప్రకారం కేవైవీ ధ్రువీకరణను పూర్తి చేయడం తప్పనిసరి. అప్లోడ్ చేసిన అన్ని ఫొటోలు స్పష్టంగా, సరైనవని మీరు నిర్ధరించుకోవాలి. కేవీవీ ఫొటోలను బ్యాంక్‌లు ధ్రువీకరిస్తాయి. ఏదైనా దరఖాస్తు బ్యాంక్ అభీష్టానుసారం తిరస్కరణకు గురైతే మీ ఫాస్టాగ్ హాట్ లిస్ట్ అయిపోతుంది. అంటే మీరు టోల్ ప్లాజాల్లో మీ ఫాస్టాగ్‌ను ఉపయోగించలేరు. అలాగే అధికారులు విధించిన జరిమానాను చెల్లించాల్సి ఉంటుంది. ఆ తర్వాత హాట్ లిస్ట్ నుంచి మీ ఫాస్టాగ్‌ను తొలగించడానికి, మీరు సరైన పత్రాలను మళ్లీ అప్లోడ్ చేయాలి. ధ్రువీకరణ పొందిన తర్వాత మీ ఫాస్టాగ్ ను హాట్ లిస్ట్ నుంచి తొలగిస్తారు.

# పాలసీదారుడు, నామినీ ఒకేసారి మరణిస్తే ఎలా బీమా క్లెయిమ్ ఎవరికి లభిస్తుంది?




పాలసీదారుడు, నామినీ ఒకేసారి మరణిస్తే ఆ బీమా పాలసీని ఎవరు క్లెయిమ్ చేసుకోవాలి?-చట్టపరమైన హక్కుదారులు ఎవరు జీవిత బీమా పాలసీని తీసుకునేటప్పుడు మన పేరు ఎంత అవసరమో, నామినీ పేరు కూడా అంతే అవసరం. ఎందుకంటే పాలసీదారుడు ఆకస్మికంగా మరణిస్తే, అతడి నామినీ బీమా పాలసీని క్లెయిమ్ చేసుకోవచ్చు. ఒకవేళ బీమా పాలసీదారుడు, అతడి నామినీ ఇద్దరూ చనిపోతే ఎలా ఇలాంటప్పుడు బీమా పాలసీ డబ్బును పొందే హక్కు ఎవరికి లభిస్తుంది చట్టపరమైన రూల్స్ ఏం చెబుతున్నాయి ఈ కథనంలో తెలుసుకుందాం.క్లెయిమ్ హక్కు ఎవరిది జీవిత బీమా పాలసీ తీసుకున్న వ్యక్తి చనిపోయాక, నామినీ జీవించి ఉంటే, అతడికే బీమా క్లెయిమ్ మొత్తాన్ని చెల్లిస్తారు. ఒకవేళ పాలసీదారుడు, నామినీ ఇద్దరూ చనిపోతే, బీమా క్లెయిమ్ మొత్తాన్ని పాలసీదారుడి చట్టపరమైన వారసులకు చెల్లిస్తారు. పాలసీదారుడు బతికి ఉండగా వీలునామా రాసి ఉంటే, దానిలో పేర్కొన్న వ్యక్తికి డబ్బు అందుతుంది. వీలునామా లేకపోతే, బీమా క్లెయిమ్ మొత్తాన్ని భారత వారసత్వ చట్టంలో పేర్కొన్న రూల్స్ ప్రకారం పంపిణీ చేస్తారు. దీని ప్రకారం బీమా పాలసీ డబ్బులపై చనిపోయిన పాలసీదారుడి జీవిత భాగస్వామి(భర్త/భార్య), పిల్లలు, తల్లిదండ్రులు తదితరులు ప్రాధాన్యతా క్రమంలో వస్తారు. పాలసీదారుడి కంటే ముందే నామినీ మరణించి ఉంటే, అలాంటప్పుడు కూడా పాలసీ మొత్తాన్ని పాలసీదారుడి చట్టపరమైన వారసులకే చెల్లిస్తారు.కేస్ స్టడీ

**- 1: భార్యాభర్త చనిపోతే!**

రాజేశ్ అనే వ్యక్తి జీవిత బీమా పాలసీని తీసుకున్నాడు. అతడు తన భార్య సునీతను నామినీగా చేశాడు. రాజేశ్ అకస్మాత్తుగా చనిపోయాడు. ఆ బీమా క్లెయిమ్ ప్రాసెస్ కావడానికి ముందే సునీత కూడా చనిపోయింది. ఇలాంటప్పుడు రాజేశ్ బీమా పాలసీని క్లెయిమ్ చేసుకునే హక్కు అతడి చట్టబద్ధమైన వారసులకు లభిస్తుంది. ఈ జాబితాలో రాజేశ్ పిల్లలు, తల్లిదండ్రులు తదితరులు వస్తారు. బతికి ఉండగా రాజేశ్ వీలునామా రాసి ఉంటే, అందులో అతడు పేర్కొన్న వ్యక్తికే బీమా క్లెయిమ్ హక్కు లభిస్తుంది.

**కేస్ స్టడీ- 2: తల్లి, కుమారుడు చనిపోతే!**

సీమ అనే మహిళ జీవిత బీమా పాలసీని తీసుకుంది. తన కుమారుడు అమిత్‌ను నామినీగా చేసింది. సీమ అకస్మాత్తుగా మరణించింది. ఈ పాలసీని క్లెయిమ్ చేయడానికి ముందే, ఓ ప్రమాదంలో అమిత్ కూడా చనిపోయాడు. పాలసీదారు సీమ, నామినీ అమిత్ లేరు. ఇలాంటప్పుడు బీమా మొత్తాన్ని సీమ చట్టబద్ధమైన వారసులకు చెల్లిస్తారు. ఈ జాబితాలో సీమ భర్త, ఇతర పిల్లలు ఉంటారు. వీరు కూడా లేనప్పుడు, సీమ తల్లిదండ్రులు ఈ పాలసీని క్లెయిమ్ చేసుకోవచ్చు. బతికి ఉండగా సీమ వీలునామా రాసి ఉంటే, అందులో ఆమె పేర్కొన్న వారికి ఈ పాలసీని క్లెయిమ్ చేసుకునే హక్కు లభిస్తుంది.

**కేస్ స్టడీ- 3: ఇద్దరు సోదరులు మరణిస్తే!**


మనోజ్ అనే వ్యక్తి జీవిత బీమా పాలసీని తీసుకున్నాడు. తన సోదరుడు సంజయ్‌ను నామినీగా చేశాడు. మనోజ్ మరణించిన తర్వాత, బీమా పాలసీని క్లెయిమ్ చేసుకునే హక్కు సంజయ్‌కు లభిస్తుంది. ఒకవేళ ఈ పాలసీని క్లెయిమ్ చేసుకోకుండా సంజయ్ మరణిస్తే, దాన్ని అతడి చట్టబద్ధమైన వారసులకు బదిలీ చేస్తారు. అంటే సంజయ్ భార్య, పిల్లలు, తల్లిదండ్రులు ఈ జాబితాలోకి వస్తారు.జీవిత బీమా పాలసీని తీసుకునేటప్పుడు ఇలాంటి అంశాల గురించి మనం తప్పకుండా తెలుసుకోవాలి. తద్వారా పాలసీ క్లెయిమ్‌తో ముడిపడిన అంశాలపై పూర్తి క్లారిటీ వస్తుంది. పైన ఉన్న కేస్ స్టడీలను బట్టి, వీలునామాకు కూడా చాలా ప్రాధాన్యత ఉందని స్పష్టమవుతోంది. పాలసీదారులు వీలునామా రాసి ఉంచడం వల్ల, ఇలాంటి అనుకోని సందర్భాల్లో అతడి చట్టపరమైన వారసులు ఎవరు అనే దానిపై క్లారిటీ వస్తుంది.

# త్వరలో 'ఆధార్'లో భారీ మార్పులు! కొత్తగా యాప్, ఫేసియల్ అథెంటికేషన్!




ఇకపై ఆధార్ వెరిఫికేషన్‌ను ఆఫ్‌లైన్‌లోనూ చేసుకునేలా యూఐడీఏఐ కొత్త ఫీచర్ మన దేశంలో ఆధార్ కార్డు ప్రాముఖ్యం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు పొందాలన్నా, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు ఇలా ఎక్కడ ఏ పని జరగాలన్నా ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు తప్పనిసరిగా మారిపోయింది. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరికి ఆధార్ ముఖ్యమైన గుర్తింపు కార్డుగా మారింది. అంతటి ప్రాధాన్యమున్న ఆధార్‌లో ఇప్పటికే అనేక మార్పులు చేయగా, ప్రజలు సులభంగా వినియోగించేలా మరికొన్నిమార్పులను ప్రవేశపె ట్టనుంది భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ). ఈ నేపథ్యంలోనేత్వరలోఆధార్ కార్డ్ లో వచ్చే మార్పులు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.కాగా,ఆన్‌లైన్ లో ఆధార్ వివరాలు మార్చుకునేలా ఇటీవలెకొత్తఅప్‌డేట్‌ను తీసుకు వచ్చారు.ఫలితంగాఆధార్‌కు సంబ ంధించినమొబైల్‌నంబర్,ఈ మెయిల్ అడ్రస్?, చిరునామాను సులభంగా ఇంట్లోనే కూర్చుని ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చు.దీంతోఆధార్ సెంట ర్‌కువెళ్లాల్సిన అవసరం ఉండదు.ఆ తర్వాత బయోమెట్రిక్ అథెంటి కేషన్‌లో కూడా కీలక మార్పులు తీసుకువచ్చింది ఆధార్ సంస్థ. ఇప్పటి వరకు ఉన్న ఫింగర్ ప్రింట్?, కంటి ఐరిస్ స్కాన్‌ను ఇప్పుడు మరింత ప్రతిభావంతంగా పనిచేసేలా మార్పులు చేశారు. ఫలితంగా బ్యాకింగ్, ఇన్సూరెన్స్‌తో పాటు ఇతర సేవలు ఉపయోగించే సమయంలో సులభంగా, వేగంగా పనులు పూర్తిచేసుకోవచ్చు.ముఖ్యంగా ప్రజల గోప్యతను దృష్టిలో పెట్టుకుని మాస్క్‌డ్ ఆధార్‌ను వినియోగించేలా ప్రచారం చేస్తుంది. ఇందులో 12 అంకెల పూర్తి ఆధార్ నంబర్ కాకుండా చివరి నాలుగు నంబర్?లు మాత్రమే కనిపిస్తాయి. దీని వల్ల యూజర్ల ప్రైవసీ భద్రంగా ఉంటుందని అంటున్నారు.బ్యాకింగ్? రంగంలో ముఖ్యమైన ఈ కేవైసీ ప్రక్రియను మరింత సులభంగా మార్చారు. ఫలితంగా కొత్త బ్యాంక్ ఖాతా, మొబైల్ కనెక్షన్, లేదా ఏదైనా ఆన్‌లైన్ సేవలను సులభంగా పొందే అవకాశం కలుగుతుంది.పాన్, బ్యాంక్ ఖాతాలకు ఆధార్ కార్డును లింక్ చేసినప్పటి నుంచి ట్యాక్స్, ఆర్థిక సేవలకు సంబంధించిన మోసాలు తక్కువవయ్యాయి.త్వరలో తీసుకువచ్చే మార్పులుఆధార్‌ను మరింత సురక్షితంగా, ఆధునికంగా మార్చేందుకు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) అనేక మార్పులు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తోంది. ఈక్రమంలోనే త్వరలోనే కొత్త మార్పులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురానుంది.ఇందులో ముందుగా బయోమెట్రిక్ వెరిఫికేషన్‌లో భాగంగా ఫేస్ అథెంటికేషన్ ఫీచర్‌ను తీసుకురానుంది.ఫలితంగా ఇప్పుడు వాడుతున్న ఫింగర్ ప్రింట్?, ఐరిస్ స్కాన్‌కు అదనంగా ఫేసియల్ అథెంటికేషన్‌ను యూజర్లు వినియోగించుకోవచ్చు.ఇకపై ఆధార్ వెరిఫికేషన్‌ను ఆఫ్‌లైన్‌లోనూ చేసుకునేలా యూఐడీఏఐ కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. దీని వల్ల ఇంటర్‌నెట్ సదుపాయం లేకుండానే ఆధార్ వెరిఫికేషన్ సులభంగా చేసు కోవచ్చు.ముఖ్యంగా డిజిటల్ ఆధార్ వాలెట్‌లా ఉపయో గపడేలా కొత్తగా ఒకయాప్‌ను తీసుకురానుంది యూఐడీఏఐ. ఫలితంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ వెరిఫికేషన్ సులభంగా కావడంతో పాటు యూజర్ వివరాలు భద్రంగా ఉంటాయి.ఇంకా ప్రజల వ్యక్తిగత వివరాలను గోప్యంగా ఉంచేలా కొత్త ఎన్‌క్రిప్షన్, మల్టీ ఫ్యాక్టర్ అథెంటికేషన్‌ను యూఐడీఏఐ ప్రవేశపెట్టనుంది. ఇది ప్రజల వివరాలను చోరీ కాకుండా చేసి మోసాలను అరికడుతుంది.

# ఒడిదుడుకులను ఎదుర్కొన్న మార్కెట్లు.. ప్లాట్‌గా ముగిసిన సూచీలు.




దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం ప్లాట్‌గా ముగిశాయి. ఉదయం నష్టాల్లో మొదలైన సూచీలు.. పొద్దంతా ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. మార్కెట్ మొదలయ్యాక కొద్దిసేపటికి మార్కెట్లు లాభాల్లోకి దూసుకెళ్లాయి. మళ్లీ మధ్యాహ్నం వరకు నష్టాల్లోకి జారుకున్నాయి. దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం ప్లాట్‌గా ముగిశాయి. ఉదయం నష్టాల్లో మొదలైన సూచీలు.. పొద్దంతా ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. మార్కెట్ మొదలయ్యాక కొద్దిసేపటికి మార్కెట్లు లాభాల్లోకి దూసుకెళ్లాయి. మళ్లీ మధ్యాహ్నం వరకు నష్టాల్లోకి జారుకున్నాయి. మళ్లి చివరి సెషన్‌లో కోలుకోవడంతో భారీ నష్టాల నుంచి బయటపడ్డాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 83,835.10 పాయింట్ల వద్ద నష్టాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 83,609.54 కనిష్టానికి చేరిన సెన్సెక్స్.. 84,127 పాయింట్ల గరిష్టానికి చేరుకుంది.చివరకు 39.78 పాయింట్ల లాభంతో 83,978.49 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 41.25 పాయింట్లు పెరిగి 25,763.35 పాయింట్ల వద్ద స్థిరపడింది. మార్కెట్‌లో 2,144 షేర్లు లాభపడగా.. 1,896 షేర్లు పతనమయ్యాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.6 శాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.7 శాతం పెరిగాయి. ఫార్మా, టెలికాం, రియాలిటీ, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు ఒకటి నుంచి రెండుశాతం పెరిగాయి. శ్రీరామ్ ఫైనాన్స్, ఎంఅండ్ఎం, అపోలో హాస్పిటల్స్, ఎస్‌బీఐ, టాటా కన్స్యూమర్ నిఫ్టీలో లాభాలను ఆర్జించాయి. మారుతి సుజుకి, ఐటీసీ, టీసీఎస్, భారత్ ఎలక్ట్రానిక్స్, ఎల్‌అండ్‌టీ నష్టపోయాయి.

## గోండు గిరిజన మహిళగా రష్మిక మందన్నా




కన్నడ హీరోయిన్ రష్మిక మందన్నా లీడ్ రోల్‌లో నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం మైసా ఈ చిత్రానికి సంబంధించి ఏదో ఒక వార్త నెట్టింట రౌండప్ చేస్తూ అభిమానులు, మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచేస్తుంది. రష్మిక మందన్నా టీం అధికారికంగా షూటింగ్ మొదలు పెట్టేసినట్టు తాజాగా వార్త తెరపైకి వచ్చింది. కేరళలోని అథిరప్పిల్లీలో అధికారికంగా నేడు షూటింగ్ మొదలైనట్టు ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. అంతేకాదు ఈ చిత్రంలో రష్మిక మందన్నా గోండ్ గిరిజన మహిళగా కనిపించనుందట. ఇప్పటికే విడుదల చేసిన రష్మిక మందన్నా ఫస్ట్ లుక్ పోస్టర్ నెట్టింట వైరల్ అవుతుండగా.. ఇదివరకెన్నడూ కనిపించని నయా అవతార్‌లో మెస్మరైజ్ చేయబోతున్నట్టు ఫస్ట్ లుక్ హింట్ ఇచ్చేస్తుంది. మైసా సినిమాతో డైరెక్టర్‌గా పాన్ ఇండియా స్థాయిలో గ్రాండ్ ఎంట్రీ ఇస్తున్నాడు. ఈ డెబ్యూ డైరెక్టర్ ఇటీవలే మైసా నుంచి రష్మిక మందన్నా అగ్రెసివ్ లుక్ లాంచ్ చేసి హైప్ క్రియేట్ చేస్తున్నాడు. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ అందిస్తున్నాడు. పుష్ప ఫ్రాంచైజీలో శ్రీవల్లిగా డీగ్లామరస్ రోల్‌లో ఇరగదీసిన రష్మిక మందన్నా మరి గోండు గిరిజన మహిళగా మైసా సినిమాలో ఎలా మెప్పించబోతున్నది సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ మూవీలో పుష్ప 2 విలన్ తారక్ పొన్నప్ప కీలక పాత్రలో నటిస్తున్నాడని తెలిసిందే. రష్మిక మందన్నా సినిమాలో తారక్ పొన్నప్ప నటించడం ఇది రెండోసారి. ఈ మూవీకి ప్రభాస్ కల్కి 2898 ఏడీ ప్రాజెక్ట్‌కు పనిచేసిన ఆండీ లాంగ్ గ్యుయెన్ స్టంట్ మాస్టర్‌గా పని చేస్తున్నాడని సమాచారం.



## రమ్యకృష్ణని ఇలా ఎప్పుడూ చూడలేదు!

రమ్యకృష్ణ పేరు చెప్పగానే ఇప్పటి జనరేషన్‌కి అయితే శివగామి పాత్ర గుర్తొస్తుంది. ఎందుకంటే 'బాహుబలి'లో ప్రభాస్, రానానే కాదు రమ్యకృష్ణ తన యాక్టింగ్‌తో చూపించిన డామినేషన్.. ఈమె సెకండ్ ఇన్నింగ్స్‌కి మంచి పునాది వేసింది. ఇప్పటికీ వరస సినిమాలు చేస్తూ బిజీగా ఉన్న రమ్యకృష్ణ.. మునుపెన్నడూ లేని విధంగా ఓ దెయ్యం సినిమా కోసం కనిపించనుంది. ఆ లుక్స్ ఇప్పుడు తెగ వైరల్ అయిపోతున్నాయి. గత కొన్నాళ్లుగా సినిమాలైతే చేస్తున్నాడు గానీ ఒక్క హిట్ కూడా కొట్టలేకపోతున్న డైరెక్టర్ రాంగోపాల్ వర్మ.. ప్రస్తుతం 'పోలీస్ స్టేషన్ మైన్ భూత్' అనే హారర్ మూవీ తీస్తున్నాడు. మనోజ్ బాజ్‌పాయ్ పోలీస్‌గా చేస్తున్నాడు. కొన్నాళ్ల క్రితం ఈ చిత్రం గురించి చెప్పిన ఆర్జీవీ.. ఓ డాన్ చనిపోయి దెయ్యమవుతాడని, తర్వాత పోలీసులని ఎలా ఇబ్బంది పెట్టాడనేది కాన్సెప్ట్ అని చెప్పుకొచ్చాడు. ఈ సినిమాలో రమ్యకృష్ణ కూడా నటిస్తోందని, ఆమె లుక్ ఇదేనంటూ ఆర్జీవీ రెండు ఫొటోలని పోస్ట్ చేశాడు. గతంలో ఎన్నడూ లేని విధంగా మాసీగా కనిపించింది. చేతిలో సిగరెట్, ముఖంపై బొట్లు, జీన్స్ ప్యాంట్ ఇలా టామ్ బాయ్ తరహాలో కనిపించింది. అయితే ఈమెది దెయ్యం పాత్ర కాదని ఆర్జీవీ క్లారిటీ ఇచ్చాడు. రీసెంట్‌గానే 'బాహుబలి' మూవీ ఎపిక్ పేరిట రిలీజైంది. దీంతో ఆ మూవీ లవర్స్.. మా శివగామిని ఇలా మార్చేశారేంటి? అని మాట్లాడుకుంటున్నారు.



## ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ సినిమాపై తప్పుడు ప్రచారం

జూనియర్ ఎన్టీఆర్ , ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమాపై ఈ మధ్య చాలా రూమర్స్ వస్తూనే ఉన్నాయి. మూవీ షూటింగ్ ఆగిపోయిందని కొద్దిరోజులుగా ప్రచారం అయింది. అయితే, ఈ మూవీ రెండు భాగాలుగా రానుందని సోషల్‌మీ డియాలో కొత్త ప్రచారం తెరపైకి తీసుకొచ్చారు. 'డ్రాగన్' పేరుతో తెరకెక్కుతున్న ఈ మూవీని మొదట ఒకే భాగంగా నిర్మించాలని మేకర్స్ అనుకున్నారట.. కానీ, రన్ టైమ్ ఎక్కువ రావడంతో రెండు పార్ట్స్‌గా విడుదల చేసేందుకు వారు ప్లాన్ చేసినట్టు ప్రచారం జరిగింది. అయితే, అందులో ఎలాంటి నిజం లేదని ప్రశాంత్ నీల్ టీమ్ తాజాగా ఒక పోస్ట్ చేసింది. దర్శకుడు ప్రశాంత్ నీల్ ఇప్పటికే కేజీఎఫ్ చిత్రాలను రెండు భాగాలుగా నిర్మించి భారీ విజయాన్ని అందుకున్నారు. సలార్ మూవీని కూడ రెండు పార్ట్స్‌గా విడుదల చేస్తామని తెలిపారు. ఇదే క్రమలో తారక్ సినిమాను కూడా సీక్వెల్ ప్లాన్ చేసే పనిలో ఉన్నారని ఒక వార్త ట్రెండ్ అయింది. అయితే, తాజాగా ప్రశాంత్ నీల్ టీమ్ ఖండించింది. '





## చిరు సినిమాలో వెంకీ పాత్ర ఇదే.. మెగాస్టార్‌తో కలిసి ఓ రేంజ్‌లో సందడి

మెగాస్టార్ చిరంజీవి విక్టరీ వెంకటేష్ కలయికలో భారీ ఎంటర్టైనర్ రానుందనే వార్తతో టాలీవుడ్ అభిమానుల్లో జోష్ మొదలైంది. ఈ ఇద్దరు స్టార్ హీరోలు కలిసి తెరపై కనిపించబోతున్న చిత్రం "మన శంకర వర ప్రసాద్ గారు". ప్రస్తుతం ఈ చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. ఈ చిత్రం తెలుగు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా కూడా మారింది. ఈ చిత్రానికి హిట్ చిత్రాల దర్శకుడు అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. కామెడీ, ఫ్యామిలీ ఎమోషన్స్, పాజిటివ్ ఎనర్జీతో నిండిన కథలను చెప్పడంలో దిట్ట అయిన ఆయన, ఈసారి చిరంజీవి - వెంకటేష్‌ల కలయికను మరింత స్పెషల్‌గా మలచబోతున్నారని సమాచారం. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, వెంకటేష్ ఈ సినిమాలో పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. అయితే అది సాధారణ పాత్ర కాదు. ఆయన పాత్రలో వినోదంతో పాటు కథను కీలక మలుపు తిప్పే ఎమోషనల్ ఎడ్జ్ కూడా ఉంటుందట. ఆయన ఎంట్రీ తర్వాత సినిమా నరేషన్ మరింత ఉత్సాహంగా మారుతుందని యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. చిరంజీవి, వెంకటేష్ కలిసి నటించిన కొన్ని సన్నివేశాలు ఇప్పటికే షూట్ పూర్తయ్యాయి. వాటిలో ఒక పాటను కూడా చిత్రీకరించారు. ఆ పాట సినిమాకు హైలైట్‌గా నిలవనుందని టీమ్ విశ్వాసం. మెగాస్టార్ మాస్ అటిట్యూడ్, వెంకటేష్ కూల్ కామెడీ, అనిల్ రావిపూడి ప్రత్యేక నేరేషన్ స్టైల్ కలగలిపి ఈ సినిమా పూర్తి ప్యాకేజీ ఎంటర్టైనర్‌గా రానుందని తెలుస్తోంది. చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లోని భారీ సెట్స్‌లో వేగంగా జరుగుతోంది. అన్ని వయసుల ప్రేక్షకులను ఆకట్టుకునేలా భావోద్వేగాలు, కామెడీ, ఫ్యామిలీ ఎలిమెంట్స్ మేళవింపుతో స్క్రిప్ట్ రూపొందించబడిందని యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. వచ్చే సంక్రాంతికి ఈ చిత్రాన్ని విడుదల చేయాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి %-% విక్టరీ వెంకటేష్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రం టాలీవుడ్‌లో అత్యంత పెద్ద మల్టీస్టారర్‌గా నిలవనుంది. అభిమానుల అంచనాల ప్రకారం, "మన శంకర వర ప్రసాద్ గారు" వచ్చే ఏడాది బాక్సాఫీస్ వద్ద భారీ హిట్‌గా నిలిచే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఈ సినిమాకి పోటీగా పలు చిత్రాలు విడుదల అవుతున్నా, అందరి దృష్టి ఈ మూవీపైనే ఉంది.

## నాని తల్లిగా సోనాలి కులకర్ణి

### ది ప్యారడైజ్ టీం కొత్త వార్త ఇదే..!



దసరా ఫేం శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్‌లో టాలీవుడ్ న్యాచురల్ స్టార్ నాని నటిస్తోన్న చిత్రం ది ప్యారడైజ్ ఈ చిత్రంలో మోహన్ బాబు కీలక పాత్రలో నటిస్తుండగా.. ఇప్పటికే విడుదల చేసిన లుక్ నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. చాలా రోజుల తర్వాత ఈ చిత్రం నుంచి ఆసక్తికర అప్‌డేట్‌తో అభిమానుల్లో జోష్ నింపుతున్నాడు నాని. ది ప్యారడైజ్‌లో నేషనల్ అవార్డ్ విన్నింగ్ నటి సోనాలి కులకర్ణి ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తుందని వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా మేకర్స్ అధికారికంగా బర్త్ డే విషెస్ తెలియజేస్తూ స్పెషల్ విషెస్ తెలియజేశారు. ఈ చిత్రంలో సోనాలి కులకర్ణి నాని తల్లిగా కనిపించనుంది. రా స్టేట్‌మెంట్ గ్లింప్స్‌లో లో ఆమె వాయిస్ ఇంటర్‌నెట్‌లో సంచలనం సృష్టించింది. సినిమాలో ఆమె నటన సెన్సేషన్ సృష్టించడం ఖాయం.. అంటూ మేకర్స్ షేర్ చేసిన పోస్టర్ సినిమాపై అంచనాలు పెంచేస్తుంది. పూణేకు చెందిన సోనాలి కులకర్ణి తెలుగులో నటిస్తోన్న తొలి సినిమా ఇదే. మరాఠీ, హిందీ, గుజరాతీ, ఇంగ్లీష్, ఇటాలియన్ భాషల్లో పలు సినిమాలు చేసింది సోనాలి కులకర్ణి. మరి శ్రీకాంత్ ఓదెల ఈ సీనియర్ నటిని సిల్వర్ స్క్రీన్‌పై ఎలా చూపించబోతున్నాడన్నది ఆసక్తికరంగా మారింది. ఈ మూవీని ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌లో దసరా ఫేం సుధాకర్ చెరుకూరి తెరకెక్కిస్తున్నారు. షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికర వార్త నెట్టింట హల్ చల్ చేస్తోంది. కిల్ యాక్టర్ రాఘవ ఈ సినిమాలో కనిపించబోతున్నాడు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఓ వైపు బ్లాక్ బస్టర్ దసరా కాంబో కావడం, మరోవైపు నాని-అనిరుధ్ కాంబోలో జెర్సీ, గ్యాంగ్ లీడర్ తర్వాత వస్తున్న సినిమా అవడంతో ది ప్యారడైజ్‌పై అంచనాలు భారీగానే ఉన్నాయి.

Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad "office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332